www.trinetnews.com

ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 93 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు బుధవారం నవంబర్ 04, 2026 పేజీలు:12 వెల.10/-

రూ.6.7 కోట్ల నకిలీ కరెన్సీ స్వాధీనం

హైదరాబాద్: నకిలీ రూ.500 కరెన్సీ నోట్లను ముద్రిస్తున్న ముఠాను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో కలసి షాద్‌నగర్ ఎస్ఓటీ బృందం అరెస్ట్ చేసింది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ ఎస్ఓటీ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రూ.6.78 కోట్ల నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నవంబర్ 1న అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో జాతీయ రహదారిపై కారును తనిఖీ చేసి మదుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపల్లి రత్నాకర్ రెడ్డి, కరణం అజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసినట్లు కమిషనర్ వివరించారు.



తుమ్మిడిహెట్టిపై రేవంత్ సర్కార్ కీలక అడుగు!

– మహారాష్ట్ర ముంపు బాధితులకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం.

- పరిహారం నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామని సీఎం ప్రకటన.
- ముంపు భూముల సర్వేకు మహారాష్ట్రకు తెలంగాణ అంగీకారం.
- గత ఒప్పందాలు, ప్రాజెక్టు వివరాలు అందించాలని అధికారులకు ఆదేశం.
- రెండు రాష్ట్రాల మధ్య చర్చలు, సమన్వయానికి ప్రాధాన్యం.
- అంతర్రాష్ట్ర అడ్డంకుల పరిష్కారంపై రేవంత్ సర్కార్ దృష్టి.
- సర్వే, పరిహారం అంచనాల తర్వాతే తదుపరి అడుగులు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్రతో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ సర్కార్ చొరవ చూపుతోంది. మహారాష్ట్రలో ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. ముంపు భూములపై మహారాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహించేందుకు కూడా అభ్యంతరం లేదన్నారు. గతంలో కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్ర అధికారులకు అందించాలని నీటిపారుదల శాఖను ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య నిరంతర చర్చలు, సమన్వయంతో ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులను పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎదురవుతున్న అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్రతో ఉన్న అంశాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రాజెక్టు కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచేందుకు కూడా తమకు అభ్యంతరం లేదని వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముంపు భూములపై సర్వే చేపట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేయడం ఈ సమీక్షలో కీలక పరిణామంగా మారింది.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉన్నతాధికారులతో

మిగతాది 2లో

24 గంటలు దాటింది.. చర్చకు వస్తారా మోదీజీ?



మిగతాది 2లో

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చ సవాల్.
- సవాల్ విసిరి 24 గంటలు దాటిందని 'ఎక్స్'లో పోస్టు.
- విదేశీ శక్తులతో సంబంధాల ఆరోపణలపై చర్చకు సిద్ధమని ప్రకటన.
- ఆర్థిక అంశాలు, అమెరికా ఒప్పందంపై ప్రశ్నలు సంధించిన రాహుల్.
- అదానీ కేసు మూసివేతపైనా చర్చిద్దామని వ్యాఖ్య.
- అవసరమైతే మోహన్ భాగవత్‌ను మధ్యవర్తిగా పెట్టుకోవచ్చని సూచన.
- విదేశీ సంబంధాల ఆరోపణలపై వాస్తవాలు బయటకు రావాలని డిమాండ్.

విదేశీ శక్తులతో సంబంధాల అంశంపై తనతో బహిరంగ చర్చకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ కి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన తాజాగా 'ఎక్స్' వేదికగా మరో పోస్టు పెట్టారు. తాను సవాల్ విసిరి 24 గంటలు దాటిందన్నారు. వీలైనంత త్వరగా బహిరంగ చర్చకు రావాలని.. భయపడొద్దని వ్యాఖ్యానించారు. కావాలంటే.. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను మధ్యవర్తిగా పెట్టుకోవచ్చన్నారు.

"ప్రతిపక్షాన్ని దేశద్రోహి అని అన్నారు కదా. దీనిపై చర్చకు ఎక్కడికైనా వస్తాను. అసలు దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? లాంటి విషయాలన్నీ తేలిపోతాయి. ఆర్థిక అంశాలు, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? క్యాబినెట్‌కు సమాచారం ఇవ్వకుండా ఒక్కరే ఎందుకు ఆ ఒప్పందం చేసుకున్నారు? అదానీ కేసును ఎందుకు మూసివేశారు? ఇలా అనేక అంశాలపై మాట్లాడదాం. నాపై ఎన్నో ఆరోపణలు చేస్తున్నారు. పరువు నష్టం దావాలు కూడా వేశారు. మరి.. విదేశీ సంబంధాల ఆరోపణలపై ఎటువంటి దావా వేయలేదేం? దాని గురించి కూడా చర్చిద్దాం. వాస్తవాలు బయటకు రానివ్వండి. దీపావళి శుభాకాంక్షలు మోదీ జీ" అని రాహుల్ పేర్కొన్నారు.



సీఎంను విమర్శించే హక్కు ప్రజలకు ఉంటుంది: మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

చెన్నై:
ప్రభుత్వాలపై ప్రజలు చేసే విమర్శల గురించి మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ముఖ్యమంత్రులను విమర్శించే హక్కు పౌరులకు ఉంటుందని పేర్కొంది. అదే సమయంలో ప్రజలకు ఉన్న అటువంటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, పోలీసులకు ఉంటుందని తెలిపింది.

2 లో

మెప్మా అదనపు డైరెక్టర్ ఇంట్లో సోదాలు.. భారీగా ఆస్తుల గుర్తింపు

హైదరాబాద్:
మెప్మా అదనపు డైరెక్టర్ యాదగిరిరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. అక్రమ మార్గాల్లో యాదగిరిరావు భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు తనిఖీల్లో గుర్తించారు. హైదరాబాద్, సూర్యాపేటలోని ఇళ్లు, కార్యాలయాలు, బ్యాంకు లాకర్లతో పాటు 10 ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు రూ.4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు గడువు పెంపు



హైదరాబాద్:
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు గడువు పొడిగిస్తున్నట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ నిలిచిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నామినేషన్ల చివరి రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితా వెలువరిస్తామని.. ఆ రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు.

హైదరాబాద్ మెట్రోలో కీలక మార్పులు..

- ఇందులో రెండో దశకు రూ.150 కోట్లు
- మొదటి దశకు మరో రూ.125 కోట్లు
- బడ్జెట్ కేటాయింపుల మేరకు విడుదల



హైదరాబాద్:
మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం రూ.275 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం రెండు జీవోలు విడుదల చేసింది. రెండో దశ కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించగా అందులో మొదటి విడతగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్‌కు రూ.150 కోట్లను విడుదల చేస్తూ పరిపాలనాపరమైన ఉత్తర్వులను జారీ చేసింది.

2లో..



రూ.6.7 కోట్ల నకిలీ కరెన్సీ స్వాధీనం

హైదరాబాద్:
నకిలీ రూ.500 కరెన్సీ నోట్లను ముద్రిస్తున్న ముఠాను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో కలసి షాద్‌నగర్ ఎస్ఓటీ బృందం అరెస్ట్ చేసింది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



2లో..

'సర్' జాబితాలో పేరు లేకున్నా.. మళ్లీ ఫారం-6!

- ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైతే కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పాత ఓటర్లు సైతం మళ్లీ ఫారం-6 సమర్పించవచ్చు.
- ఫారం-6లోని 'మొదటిసారి ఓటరు' డిక్లరేషన్‌పై భయపడాల్సిన అవసరం లేదు.
- పాత ఓటర్లు దరఖాస్తు చేసినా కేసులు నమోదు చేయవద్దని ఈసీ ఆదేశం.
- సెక్షన్-31 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవద్దని స్పష్టీకరణ.
- మరో నియోజకవర్గంలో ఓటు ఉండకూడదని ఈసీ నిబంధన.

ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-6 దరఖాస్తుపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక విషయం వెల్లడించింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పాత ఓటర్లుగా ఉన్నప్పటికీ మళ్లీ ఫారం-6 సమర్పించినా నేరం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల సీఈవోలకు లేఖ రాసింది.


కుప్పంకు కృష్ణాజలాలు.. రేవంత్ గురుదక్షిణే!

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు.
- చంద్రబాబుకు గురుదక్షిణగా కుప్పంకు కృష్ణాజలాలు తరలించారని ఆరోపణ.
- పాలమూరును ఎండబెట్టి దిగువకు వరద జలాలు వదిలారని విమర్శ.
- శ్రీశైలం, జూరాలకు భారీగా నీళ్లు వచ్చినా వినియోగించుకోలేదని వ్యాఖ్య.
- కేఎల్ఐ ద్వారా 50 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉన్నా.. ఎత్తింది 18 టీఎంసీలేనని ఆరోపణ.
- అల్వాలలో 250 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని వెల్లడి.
- రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆరోపణ.
- రైతులకు పరిహారం అందించే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హామీ.



మిగతాది 2లో

నీటి వృథాకు చెక్.. రంగంలోకి వాటర్ వారియర్స్!



- హైదరాబాద్‌లో నీటి వృథా అరికట్టేందుకు జలమండలి కొత్త చర్యలు.
- PAANI యాప్‌కు నగరవాసుల నుంచి విశేష స్పందన.
- ఇప్పటికే 437 మంది వాటర్ వారియర్లుగా నమోదు.
- నీటి దుర్వినియోగంపై ఫొటోలు, వివరాలతో ఫిర్యాదు చేసే అవకాశం.
- నల్లా నీటితో వాహనాల వాషింగ్, పైపుల లీకేజీలపై నిఘా.
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ.
- ఉల్లంఘనలపై నోటీసులు, నిబంధనల ప్రకారం చర్యలు.
- ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ప్రతి ఇంటా 20 శాతం నీటి పొదుపు లక్ష్యం.

మహానగరంలో అమూల్యమైన తాగునీటి వృథా, దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు వినూత్న ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. నీటి సంరక్షణలో సామాన్య పౌరులను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రవేశపెట్టిన గ్రూఅూచీ× మొబైల్ యాప్‌కు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తాగునీటి రక్షణ కోసం ఇప్పటివరకు నగరవ్యాప్తంగా 437 మంది స్వచ్ఛందంగా జలమండలి పోర్టల్‌లో వాటర్ వారియర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. నగరంలో నీటి సంరక్షణపై ఆసక్తి, బాధ్యత ఉన్న ప్రతి పౌరుడూ వాటర్ వారియర్‌గా మారవచ్చని జలమండలి స్పష్టం చేసింది. వాలంటీర్లుగా నమోదు చేసుకున్న వారు గూగుల్ ప్లే స్టోర్ నుంచి గ్రూఅూచీ× యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ పరిసర ప్రాంతాల్లో జరిగే తాగునీటి దుర్వినియోగాన్ని ఫొటోలు, వివరాలతో నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ముఖ్యంగా నల్లా నీటితో వాహనాలు కడగడం, హోస్‌పైపులతో ఫ్లోర్లు క్లీన్ చేయడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిండి రోడ్లపై పొంగిపొర్లడం, పైప్‌లైన్ల లీకేజీలు వంటి సమస్యలను ఈ యాప్ ద్వారా సులభంగా రిపోర్ట్ చేయవచ్చు.

మిగతాద్ది 2 లో

తుమ్మిడిహెట్టిపై రేవంత్ సర్కార్ కీలక అడుగు!

మొదటిపేజీ తరువాయి

మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. రెండు రాష్ట్రాల మధ్య గతంలో కుదిరిన ఒప్పందాలు, ఇతర కీలక అంశాలకు సంబంధించిన పత్రాలను సమగ్రంగా సిద్ధం చేసి మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని సీఎం సూచించారు.

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి సందేహాలు తలెత్తకుండా అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అక్కడి అధికారులకు అందించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్న అంశం మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల అక్కడి భూములకు నష్టం కలిగే పరిస్థితి ఉంటే.. బాధితులకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. పరిహారం చెల్లింపులకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, వాటి వివరాలను నిర్ధారించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తే సహకరించాలని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సర్వేకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. దీంతో ముంపు సమస్యను పరిష్కరించేందుకు రెండు రాష్ట్రాల మధ్య సమన్వయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడైంది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీకి మహారాష్ట్ర సానుకూలత.. 152 మీటర్ల ఎత్తు పెంపుపై అధ్యయనానికి కమిటీ

ఇది చదివారా:
తుమ్మిడిహెట్టి బ్యారేజీకి మహారాష్ట్ర సానుకూలత.. 152 మీటర్ల ఎత్తు పెంపుపై అధ్యయనానికి కమిటీ

మహారాష్ట్ర అధికారులకు అవసరమైన సమాచారం అందించడంలో జాప్యం చేయవద్దని.. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, గత చర్చలకు సంబంధించిన ఆధారాలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం లేకుండా నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని చెప్పారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశం తెలంగాణ సాగునీటి రంగంలో కీలకమైనది. మహారాష్ట్రలో ముంపు సమస్య, భూసేకరణ, పరిహారం వంటి అంశాలు రెండు రాష్ట్రాల మధ్య చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పుడు పరిహారం చెల్లించేందుకు సిద్ధమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించడం, ముంపు భూముల సర్వేకు అంగీకరించడం ద్వారా సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేసే ప్రయత్నం జరుగుతోంది. అయితే ఈ నిర్ణయంతోనే ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అన్ని అడ్డంకులు తొలగిపోయినట్లు భావించలేమని నిపుణులు చెబుతున్నారు.

'తుమ్మిడిహెట్టి అయ్యేది కాదు, పొయ్యేది కాదు.. శంకుస్థాపన చేస్తే రాజీనామా చేస్తా'.. బీజేపీ ఎమ్మెల్యే సంచలన ప్రకటన

ఇది చదివారా:
'తుమ్మిడిహెట్టి అయ్యేది కాదు, పొయ్యేది కాదు.. శంకుస్థాపన చేస్తే రాజీనామా చేస్తా'.. బీజేపీ ఎమ్మెల్యే సంచలన ప్రకటన

ముంపు భూముల సర్వే, పరిహారం అంచనాలు, రెండు రాష్ట్రాల మధ్య తదుపరి ఒప్పందాలు వంటి ప్రక్రియలు పూర్తికావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ అంశాల్లో పురోగతి సాధిస్తే తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి కీలక ముందడుగు పడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ అంశంపై చర్చలను వేగవంతం చేయాలని భావిస్తోంది.
తుమ్మిడిహెట్టిపై రేవంత్ సర్కార్ తీసుకున్న పరిహారం

నీటి వృథాకు చెక్.. రంగంలోకి వాటర్ వారియర్స్!

మొదటిపేజీ తరువాయి

గోప్యంగా విచారణ.. నిబంధనల ప్రకారం చర్యలు

వాటర్ వారియర్లు పంపిన ఫిర్యాదులను క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ అధికారులు వెంటనే పరిశీలిస్తారు. నీటి దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. అయితే ఫిర్యాదు చేసిన వారి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టకుండా అత్యంత గోప్యంగా ఉంచుతామని జలమండలి హామీ ఇచ్చింది.

ముంచుకొస్తున్న ఎల్‌నినో ప్రభావం.. 20 శాతం పొదుపు లక్ష్యం

రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జలమండలి విజ్ఞప్తి చేసింది. ప్రతి కుటుంబం తమ రోజువారీ వినియోగంలో కనీసం 20 శాతం నీటిని పొదుపు చేయాలని పిలుపునిచ్చింది. ఇంట్లో చిన్నపాటి లీకేజీలను సైతం వెంటనే అరికట్టాలని, తాగునీటిని ఇతరత్రా అవసరాలకు వినియోగించవద్దని సూచించింది.

నగరంలోని ప్రతి కాలనీ, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వాటర్ వారియర్లుగా ముందుకు రావాలని అధికారులు కోరారు. నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మలచడమే లక్ష్యంగా జలమండలి అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిరంతరం అందుబాటులో ఉంచింది.

మెప్మా అదనపు డైరెక్టర్ ఇంట్లో సోదాలు.. భారీగా ఆస్తుల గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, సూర్యాపేటలో 12 స్థలాలు, ఉప్పల్‌లో 2 ఫ్లాట్లు, రూ.2కోట్ల విలువైన మూడంతస్తుల భవనం, ఓ దుకాణం, సూర్యాపేట జిల్లాలో మరో ఇల్లు, 1,792.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి నగలు, బ్యాంకు ఖాతాల్లో రూ.32.30లక్షల నగదు, 2 లగ్జరీ కార్లు, 3 బైక్‌లు ఉన్నట్టు తనిఖీల్లో తేలింది. యదగిరిరావు కుమారుడి పెట్టుబడులకు సంబంధించిన వివరాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

రూ.6.7 కోట్ల నకిలీ కరెన్సీ స్వాధీనం

మొదటిపేజీ తరువాయి

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ ఎస్ఓటీ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రూ.6.78 కోట్ల నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నవంబర్ 1న అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో జాతీయ రహదారిపై కారును తనిఖీ చేసి మడుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపల్లి రత్నాకర్ రెడ్డి, కరణం అజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసినట్లు కమిషనర్ వివరించారు. విచారణలో కుంట్లూర్‌లోని అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న నకిలీ కరెన్సీ తయారీ కేంద్రాన్ని గుర్తించి, ప్రింటర్లు, ల్యాప్‌టాప్, నోట్ల కటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు నకిలీ పోలీస్ గుర్తింపు కార్డులు, వాకీటాకీలు, డమ్మీ పిస్టల్ ఉపయోగించి పోలీసులుగా నటిస్తూ ప్రజలను బెదిరించి డబ్బులు దోచుకున్నట్లు కమిషనర్ వివరించారు.

కుప్పంకు కృష్ణాజలాలు రేవంత్ గురుదక్షిణే..

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

వనపర్తి: ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ ఇచ్చేందుకు 700 కి.మీ. దూరంలోని కుప్పంకు కృష్ణాజలాలను తరలించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పాలమూరును ఎండబెట్టి దిగువకు వరుదను వదిలిపెట్టిన ఘనత అసమర్థ పాలకుడు రేవంత్‌కే చెల్లుతుందన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఎండిన పంటలను ఆయన మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో హరీశ్ మాట్లాడారు. నీళ్లకు, కరెంటుకు, పంటలకు సెలవు ఇవ్వాలంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన బాధ్యతల నుంచి సెలవు ఇచ్చే రోజులు దగ్గర పడ్డాయన్నారు. శ్రీశైలానికి 221 టీఎంసీలు, జూరాలకు 252 టీఎంసీల నీళ్లు వచ్చినా.. సకాలంలో వరద జలాలను సద్వినియోగం చేసుకుని చెరువులు, రిజర్వాయర్లను నింపుకునే ప్రయత్నం చేయకపోవడంతో పాలమూరు జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, వచ్చేది కేసీఆర్ సర్కారేనని, మళ్లీ పాలమూరులో పసిడి పంటలు పండేలా సాగునీటి వనరులను సమకూరుస్తామని చెప్పారు.

50 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉన్నా...

కేఎల్ఐ లిఫ్ట్‌లోని మోటార్లు పూర్తిస్థాయిలో నడిస్తే.. నెలకు పది టీఎంసీల చొప్పున ఇప్పటి వరకు 50 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉన్నా.. ఇప్పటి వరకు లిఫ్ట్ చేసింది కేవలం 18 టీఎంసీలేనని, మిగతా నీటిని గురువు చంద్రబాబుకు వదిలిపెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డిలో వారం రోజుల్లో తీసే మట్టి తవ్వకం కూడా చేపట్టలేని చేతగాని ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయున్నారు. ఒక్క అల్వాల గ్రామంలోనే 250 ఎకరాలు, రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా.. రైతులు, రైతుకూలీలకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, సాయం ఏమి చేస్తారో చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఆంధ్రాకు వరదలొస్తే పరిగెత్తుకొచ్చిన కేంద్ర బృందాలు తెలంగాణలో కరువు వస్తే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాలనే ధ్యాస రాష్ట్రాన్ని పాలిస్తున్న రేవంత్‌రెడ్డికి, కేంద్ర మంత్రులకు, బీజేపీకి లేకపోవడం బాధాకరమన్నారు. రైతులకు పరిహారం ఇచ్చే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్

'సర్' జాబితాలో పేరు లేకున్నా.. మళ్లీ ఫారం-6!

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో ఓటు కోల్పోయిన వారు కొత్తగా ఫారం-6 సమర్పించవచ్చని ఈసీ పేర్కొంది. అందులోని 'మొదటిసారి ఓటు' అనే డిక్లరేషన్‌పై పాత ఓటర్లు భయపడాల్సిన అవసరం లేదని తెలిపింది. పాత ఓటర్లు ఈ ఫారంతో దరఖాస్తు చేసినా.. సెక్షన్ 31 కింద కేసులు నమోదు చేయవద్దని సీఈవోలకు స్పష్టం చేసింది. అయితే, సంబంధిత ఓటరుకు మరో నియోజకవర్గంలో ఓటు ఉండకూడదని పేర్కొంది.

24 గంటలు దాటింది.. చర్చకు వస్తారా మోదీజీ?

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై ప్రధాని మోదీ ఇటీవల పరోక్ష విమర్శలు చేశారు. "విదేశాల్లో రహస్యంగా కొందరిని కలుస్తున్నది ఎవరు? భారత్‌ను వ్యతిరేకిస్తున్న శక్తుల మద్దతు అందుకుంటున్న వ్యక్తి ఎవరు? మన శత్రువుల భాషలో మాట్లాడుతోంది ఎవరు?" అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలను రాహుల్ తిప్పికొట్టారు. మోదీయే విదేశీ శక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారని ప్రత్యారోపణ చేశారు. ఈ అంశంపై తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు.

హైదరాబాద్ మెట్రోలో కీలక మార్పులు..

మొదటిపేజీ తరువాయి

అలాగే ప్రస్తుతం వివిధ కారిడార్‌లలో నడుస్తున్న మెట్రో రైళ్ల నిర్వహణ, కొత్త కోచ్‌ల కొనుగోళ్లు, తదితర అవసరాల కోసం మరో రూ.125 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్ ఉత్తర్వులు వెలువరించారు.

పాతబస్తీలో విస్తరణ...

ప్రస్తుతం మెట్రో రెండో దశలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కి.మీ కారిడార్‌లో రోడ్ల విస్తరణ, ఆస్తుల సేకరణ, పరిహారం చెల్లింపు, తదితర పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 850 నిర్మాణాలను తొలగించేందుకు హెచ్ఎంఆర్ఎల్ చర్యలు చేపట్టింది. మెట్రో రెండో దశపైన కేంద్రం నుంచి అనుమతి లభించిన వెంటనే ఈ కారిడార్‌లో నిర్మాణ పనులను చేపట్టేందుకు వీలుగా రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం చెల్లిస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం రూ.150 కోట్లు విడుదల చేసినట్లు హెచ్ఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

కొత్త కోచ్‌ల కొనుగోళ్లు

ప్రభుత్వం విడుదల చేసిన మరో రూ.125 కోట్లను కొత్త కోచ్‌ల కొనుగోళ్లు, తదితర అవసరాలకు వినియోగించనున్నారు. ఒక కోచ్ నిర్మాణానికి రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఖర్చు కావచ్చునని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 5 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. కోచ్‌ల సంఖ్య పెరిగితే మరో 2 లక్షల మంది అదనంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న మూడు కోచ్‌ల మెట్రోలకే అదనంగా మరో 3 కోచ్‌లను ఏర్పాటు చేస్తారు.

బెట్టింగ్ పిచ్చి.. యూట్యూబ్‌లో చూసి ఈ కేటుగాడు ఏం చేశాడో తెలుసా..?

క్రికెట్ బెట్టింగ్ వ్యసనం పచ్చని జీవితాలను ఎలా నాశనం చేస్తుందో, క్షణికావేశంలో చేసే అప్పులు మనుషులను ఎంతటి ఘోరాలకు పురిగొల్పుతాయో చెప్పేందుకు నగరంలో వెలుగుచూసిన ఈ ఘటనే తాజా నిదర్శనం. బెట్టింగ్‌లో పెట్టిన డబ్బంతా పోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఓ వ్యక్తి.. వాటిని తీర్చేందుకు అడ్డదారి తొక్కాడు. ఏకంగా యూట్యూబ్‌లో వీడియోలు చూసి చైన్ స్నాచింగ్ ఎలా చేయాలో ట్రెయినింగ్ తీసుకుని, ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడ్డాడు. చివరకు చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘాకు చిక్కి కటకటాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బాలాపూర్‌కు చెందిన మహమ్మద్ గౌస్ పాషా (34) కొద్దికాలంగా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. బెట్టింగుల్లో లక్షలాది రూపాయలు పోగొట్టుకోవడంతో అప్పులు గుట్టలుగా పేరుకుపోయాయి. అప్పుల వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో అతి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం చైన్ స్నాచింగ్ చేయాలని పథకం వేశాడు. సాధారణంగా ప్రజలు



యూట్యూబ్‌ను నైపుణ్యాలు, విజ్ఞానం కోసం ఉపయోగిస్తే.. ఈ నిందితుడు మాత్రం జనం కళ్లుగప్పి చైన్ స్నాచింగ్ ఎలా చేయాలి? బైక్‌పై ఎలా తప్పించుకోవాలి? అనే అంశాలపై యూట్యూబ్‌లో గంటల తరబడి వీడియోలు చూసి నేర పాఠాలు నేర్చుకున్నాడు.

వృద్ధురాలిపై కన్ను.. క్షణాల్లో గొలుసు మాయం

యూట్యూబ్‌లో చూసిన ప్లాన్ ప్రకారం రంగంలోకి దిగిన గౌస్ పాషా.. సైదాబాద్‌లోని కరన్‌బాగ్ ప్రాంతంలో ఒంటరిగా సంచరిస్తున్న 76 ఏళ్ల మీనాక్షి అనే వృద్ధురాలిని టార్గెట్ చేశాడు. బైక్‌పై ఆమెను సమీపించి, క్షణాల వ్యవధిలో మెడలోని బంగారు గొలుసును బలంగా లాక్కొని అక్కడి నుంచి వేగంగా ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు, చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడి కదలికలను గుర్తించారు.

పోలీసుల మెరుపు దాడి.. నిందితుడి అరెస్ట్

పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడు మహమ్మద్ గౌస్ పాషాను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.3.5 లక్షల విలువైన బంగారు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు బెట్టింగ్ అప్పుల కోసమే ఈ చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ యాప్‌ల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

సీఎంను విమర్శించే హక్కు ప్రజలకు ఉంటుంది: మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు



మొదటిపేజీ తరువాయి

తమిళనాడు సీఎం విజయ్ ను కించపరిచారనే ఆరోపణలతో డీఎంకే కౌన్సిలర్ సుధపై నమోదైన కేసులో ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ.. జస్టిస్ ఎన్. రమేశ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించడం, విమర్శించడం, వ్యతిరేకతను తెలియజేయడం పౌరుల ప్రాథమిక హక్కు. రాజ్యాంగం ప్రకారం.. ప్రభుత్వాన్ని ప్రశంసించడంతో పాటు విమర్శించే స్వేచ్ఛ కూడా ప్రజలకు ఉంటుంది.
పాలన మారవచ్చు, ముఖ్యమంత్రులు మారవచ్చు, కానీ చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రం ఎప్పటికీ మారదు. ఓ రాజకీయ నాయకుడి ప్రసంగం పాలకులను అవమానించేలా ఉన్నంత మాత్రాన అది నేరం కాదు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రితో సహా ప్రజా జీవితంలో ఉన్న నేతలందరికీ ఉంటుంది. పాలకులు విమర్శలకు అతీతులు కారు' అని కోర్టు పేర్కొంది. చట్టాన్ని అమలు చేసే అధికారులుగా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది.

వేలిముద్రలు దొరకకుండా ఆనవాళ్లపై కారం చల్లిన దొంగ.. అయినా ఎలా చిక్కాడంటే..?

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న ఘరానా దొంగను కరీంనగర్ రూరల్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. వేలిముద్రలు లభించకుండా దొంగతనం చేసిన ఇంట్లో కారం పొడి చల్లినప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం అల్లీపూర్‌కు చెందిన బాలసాని అజయ్ ఇంటర్ చదువుతున్న సమయంలోనే దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గతంలో మానకొండూరు మండలం ఊటూరు బ్యాంకులో దోపిడీ కేసుతో పాటు, సుల్తానాబాద్‌లో జరిగిన మూడు దొంగతనాల కేసుల్లో అరెస్టయ్యాడు. 2025లో హైదరాబాద్‌కు వెళ్లిన అజయ్.. అక్కడి ఏఎంబీ షాపింగ్ మాల్‌లో కొంతకాలం సేల్స్‌మెన్‌గా పనిచేశాడు. ఈ సమయంలో అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రాజుతో పరిచయం ఏర్పడింది.

వికసిత భారత్ నిర్మాణానికి యువత సారథ్యం వహించాలి: పీయూష్ గోయల్

ఈ ఏడాది ట్రిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యం..
తొలి ఆరు నెలల్లో 14 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రయాణంలో యువత కీలక పాత్ర పోషించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, మార్పులను స్వీకరిస్తూ దేశ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. మంగళవారం న్యూఢిల్లీలోని కిరోరిమల్ కళాశాలలో నిర్వహించిన 'యంగ్ లీడర్స్ డిస్కోర్స్ ఫోరం'లో ఆయన ముఖ్యోపన్యాసం చేశారు.

భారత స్వాతంత్ర్య శతాబ్ది నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పంలో రాజీ లేదని గోయల్ స్పష్టం చేశారు. అప్పటికి నేటి విద్యార్థులు నలభై ఏళ్ల వయసులో ఉంటారని, వారి నిర్ణయాలు, ఆకాంక్షలు, కృషి దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని పేర్కొన్నారు.

దేశ ఎగుమతులు గత ఏడాది రికార్డు స్థాయిలో 863 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపారు. ప్రస్తుత ఏడాదికి సుమారు 16 శాతం వృద్ధితో ట్రిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే ఎగుమతులు 14 శాతం పెరిగి 480 బిలియన్ డాలర్లకు చేరాయని చెప్పారు. వార్షిక లక్ష్యాన్ని అందుకునేందుకు మిగిలిన ఆరు నెలల్లో మరో 520 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించాల్సి ఉందన్నారు. అక్టోబర్‌లోనూ ఎగుమతుల పనితీరు సానుకూలంగా ఉందని, నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

భారత్ ప్రపంచంలో విశ్వసనీయ భాగస్వామిగా ఎదిగిందని గోయల్ పేర్కొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన దేశాలు భారత్‌తో ప్రాధాన్య వాణిజ్య ఒప్పందాలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. యువత ప్రతిభ, నైపుణ్యాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, నిర్ణయాత్మక నాయకత్వం, 140 కోట్ల మంది ప్రజల వినియోగ అవసరాలు దేశ ఆర్థిక వృద్ధికి బలాన్నిస్తున్నాయని వివరించారు.

ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ దేశంలో సుమారు 50 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. కొవిడ్ సమయంలో దేశ ప్రజలకు ఉచిత టీకాలు అందించడంతోపాటు ఇతర దేశాలకు వ్యాక్సిన్లు, ఔషధాలు సరఫరా చేశామని గుర్తుచేశారు. సంక్షోభ సమయాల్లో అందించిన సహాయ సహకారాలు అంతర్జాతీయంగా భారత్‌పై విశ్వాసాన్ని పెంచాయన్నారు.

విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కళాశాలలు విద్యతోపాటు వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, కష్టపడే తత్వాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర విశేషమైనదని కొనియాడారు.

జాతీయ విద్యా విధానం ద్వారా కోర్సులు, విద్యా విభాగాలు మార్చుకునేందుకు, సంపాదించిన క్రెడిట్లను వినియోగించుకునేందుకు అవకాశాలు విస్తరించాయని తెలిపారు. దేశంలో 110 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్న నేపథ్యంలో యువత ప్రపంచస్థాయి విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సంప్రదాయాల పట్ల గౌరవం, ఆత్మవిశ్వాసం, ధైర్యంతో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని గోయల్ పిలుపునిచ్చారు.

బయోఫార్మా స్టార్టప్‌లకు వేగంగా అనుమతులు ఇవ్వాలి: పీయూష్ గోయల్

నిధుల లభ్యత, ఉమ్మడి పరిశోధన సదుపాయాలు, నియంత్రణ సంస్కరణలపై రౌండ్‌టేబుల్ చర్చ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

భారత శాస్త్రసాంకేతిక సామర్థ్యాలు, యువ పారిశ్రామికవేత్తల ప్రతిభను ఉపయోగించుకుని జీవ ఆర్థిక వ్యవస్థలో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో 'భారత జీవ ఆర్థిక వ్యవస్థలో అవకాశాలు--ఆవిష్కరణలు, వృద్ధిలో స్టార్టప్‌ల పాత్ర' అంశంపై నిర్వహించిన ఉన్నతస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

నీతి ఆయోగ్, నీతి ఫ్రాంటియర్ టెక్ హబ్ సహకారంతో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఈ సమావేశాన్ని నిర్వహించింది. విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రముఖులు, బయోఫార్మా స్టార్టప్‌ల ప్రతినిధులు పాల్గొని రంగం అభివృద్ధికి అవసరమైన చర్యలపై చర్చించారు.

స్టార్టప్‌లకు వేగవంతమైన అనుమతులు, సులభంగా నిధుల లభ్యత, ఉమ్మడి మౌలిక సదుపాయాలు అవసరమని గోయల్ పేర్కొన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం మధ్య సహకారాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో వచ్చిన సిఫార్సులపై నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నియంత్రణ విధానాల సరళీకరణ, ఏకగవాక్ష అనుమతులు, అంతర్జాతీయ నియంత్రణ ప్రమాణాలతో అనుసంధానం, పేటెంట్ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడంపై చర్చించారు. నియంత్రిత వాతావరణంలో కొత్త ఆవిష్కరణలను పరీక్షించేందుకు ప్రతిపాదిత 'రెగ్యులేటరీ శాండ్‌బాక్స్' ఏర్పాటును పరిశీలించారు.

కేంద్ర బడ్జెట్ 2026--27లో ప్రకటించిన 'బయోఫార్మా శక్తి' ప్రాధాన్యాన్ని సమావేశంలో ప్రస్తావించారు. స్టార్టప్‌ల వ్యయభారాన్ని తగ్గించి, ఆవిష్కరణలను విస్తరించేందుకు ఉమ్మడి ప్రయోగశాలలు, పరీక్షా కేంద్రాలు, క్లినికల్ ట్రయల్ సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ప్రపంచస్థాయిలో పోటీపడే జీవ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి అన్ని వర్గాల సమన్వయం కీలకమని నీతి ఆయోగ్ విశిష్ట ఫెలో దేబ్‌జానీ ఘోష్ తెలిపారు. పరిశోధన సామర్థ్యాలను పెంచి, శాస్త్రీయ ఆవిష్కరణలను వాణిజ్యపరంగా ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చాలని నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ గోవర్ధన్ దాస్ సూచించారు.

దేశీయ జీవశాస్త్ర ఉత్పత్తుల తయారీని బలోపేతం చేయడం, ప్రయోగశాల పరికరాలు, రసాయన కారకాలకు కస్టమ్స్ క్లియరెన్స్‌ను వేగవంతం చేయడం, ప్రభుత్వ పథకాలు--నియంత్రణ సహకారాన్ని సులభంగా అందించడంపైనా చర్చించారు. రంగానికి సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం పెంచాలని పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

కాప్--31లో సమానత్వం, ఆచరణాత్మక వాతావరణ చర్యలే భారత్ లక్ష్యం

వాతావరణ నిధులు, సాంకేతిక బదిలీ, న్యాయబద్ధ పరివర్తనకు ప్రాధాన్యం: భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

వాతావరణ మార్పులపై అంతర్జాతీయ చర్యలు సమానత్వంతో, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా సాగాలని భారత్ కృషి చేయనున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. నవంబర్ 9 నుంచి 20 వరకు తుర్కియేలోని అంటాల్యాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్--31లో భారత్ ప్రాధాన్యాలను మంగళవారం న్యూఢిల్లీలో మీడియాకు వివరించారు.అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాల పెంపు, విజ్ఞాన భాగస్వామ్యం, ఆయా భౌగోళిక పరిస్థితులకు తగిన పరిష్కారాలపై భారత్ దృష్టి సారిస్తుందని చెప్పారు. జీ--77, చైనా, ఎల్ఎండీసీ, బేసిక్ దేశాల సమూహాలతో కలిసి పనిచేస్తామన్నారు. పారిస్ ఒప్పంద లక్ష్యాల సాధనకు సానుకూల సహకారం అందించేందుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

వాతావరణ నిధుల సమీకరణ ప్రధాన ప్రాధాన్యంగా ఉంటుందని మంత్రి తెలిపారు. పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 9.1 ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహాయం అందించడం అభివృద్ధి చెందిన దేశాల బాధ్యత అని గుర్తుచేశారు. ఈ నిధులు స్థిరంగా, ముందస్తు అంచనాకు వీలుగా, ప్రధానంగా ప్రభుత్వ వనరుల నుంచి రాయితీ



నిబంధనలతో అందాలని, రుణభారాన్ని పెంచకూడదని పేర్కొన్నారు.

ఉద్గారాల తగ్గింపు చర్యలు, ప్రపంచ పురోగతి సమీక్ష దేశాల ఆధ్వర్యంలోనే సాగాలని యాదవ్ అన్నారు. జాతీయంగా నిర్ణయించుకున్న వాతావరణ లక్ష్యాలను గౌరవిస్తూ, పైస్థాయి నుంచి కొత్త లక్ష్యాలను రుద్దకూడదన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే అనుకూలన చర్యలకు నిధులు పెంచాలని, సంబంధిత ప్రపంచ సూచికలను నిధుల లభ్యతకు షరతులుగా విధించకూడదని స్పష్టం చేశారు.

న్యాయబద్ధ పరివర్తనను వాతావరణ న్యాయం, అభివృద్ధి హక్కు, అందుబాటు ధరల్లో ఇంధన ప్రాప్తి కోణంలో చూడాలని తెలిపారు. సాంకేతిక బదిలీకి వ్యయం, మేధోసంపత్తి హక్కులు, వాణిజ్యపరమైన అడ్డంకులను పరిష్కరించాలని కోరారు. కార్బన్ మార్కెట్లలో భాగస్వామ్యం స్వచ్ఛందంగానే ఉండాలన్నారు.

వ్యవసాయం, ఆహార భద్రత, చిన్న--సన్నకారు రైతుల జీవనోపాధితో వాతావరణ అనుకూలనకు ఉన్న సంబంధాన్ని భారత్ సదస్సులో ప్రస్తావించనుంది. స్వీడన్‌తో కలిసి లీడ్ఐటీ 3.0 కార్యక్రమంతోపాటు తీరప్రాంతాల స్థితిస్థాపకత, అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్, అడవులపై చర్చల్లో పాల్గొననుంది.

అర్మేనియాలోని యెరెవాన్‌లో జరిగిన జీవవైవిధ్య సదస్సు కాప్--17లో కున్మింగ్--మాంట్రియల్ ప్రపంచ జీవవైవిధ్య చట్రాన్ని సమర్థంగా, సమానత్వంతో అమలు చేయాలని భారత్ కోరినట్లు మంత్రి తెలిపారు. జీవవైవిధ్య పరిరక్షణకు తగిన నిధులు, సాంకేతిక సహకారం, స్థానిక సమాజాల భాగస్వామ్యం అవసరమన్నారు. జన్యు వనరుల డిజిటల్ సీక్వెన్స్ సమాచార వినియోగం ద్వారా వచ్చే ప్రయోజనాలను న్యాయంగా పంచాలని భారత్ స్పష్టం చేసిందన్నారు.

మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో జరిగిన ఎడారీకరణ నిరోధక సదస్సు కాప్--17లో భూ పునరుద్ధరణ, కరవును తట్టుకునే సామర్థ్యంపై భారత్ దృష్టి సారించిందని చెప్పారు. 2030 నాటికి 2.6 కోట్ల హెక్టార్లకు పైగా భూమిని పునరుద్ధరించాలన్న నిబద్ధతను పునరుద్ఘాటించామన్నారు. కరవు వచ్చిన తర్వాత స్పందించడం నుంచి ముందస్తు సన్నద్ధత వైపు మారాలని సూచించినట్లు తెలిపారు.

అంటాల్యా సదస్సులో హామీల నుంచి అమలు దిశగా పురోగతి సాధించే సమతుల్య ఫలితాల కోసం భారత్ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

సోమాలియా తీరంలో సముద్ర దొంగల చెర నుంచి 'అజిని' విముక్తి

భారత నౌకాదళం ఆపరేషన్ విజయవంతం.. 20 మంది సిబ్బంది సురక్షితం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:



సోమాలియా తీరంలో సాయుధ సముద్ర దొంగలు హైజాక్ చేసిన 'అజిని' చేపల వేట నౌకను భారత నౌకాదళం విజయవంతంగా విడిపించింది. 48 గంటలకు పైగా సాగిన సమన్వయ ఆపరేషన్‌లో నౌకలోని 20 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించింది. ఈ చర్యలో ఎవరికీ గాయాలు, ప్రాణనష్టం సంభవించలేదు.గత నెల ప్రారంభంలో సోమాలియా ఈశాన్య తీరానికి సమీపంలో అజిని నౌక హైజాక్‌కు గురైనట్లు సమాచారం అందింది. ఈ నౌకను స్థావరంగా ఉపయోగించుకుని సముద్ర దొంగలు వాణిజ్య నౌకలపై మరిన్ని దాడులకు పాల్పడే ప్రమాదం ఉండటంతో భారత నౌకాదళం రంగంలోకి దిగింది.సముద్ర నిఘా విమానం సహకారంతో విధుల్లో ఉన్న యుద్ధనౌకను సహాయక చర్యలకు పంపించింది. నిరంతర నిఘాతో అజిని ఆచూకీని గుర్తించి, దాని కదలికలను పర్యవేక్షించింది. కాల్పులకు తావులేని నియంత్రిత చర్యలతో నౌక తప్పించుకోకుండా అడ్డుకుంది.ఆపరేషన్‌కు అదనపు బలంగా భారత వైమానిక దళానికి చెందిన సీ--17 విమానం ద్వారా మెరైన్ కమాండోలను నిర్దేశిత ప్రాంతంలో ఖచ్చితత్వంతో ఎయిర్‌డ్రాప్ చేశారు. అనంతరం సమన్వయంతో చేపట్టిన వ్యూహాత్మక చర్యలో సముద్ర దొంగల ముప్పును అధిగమించి, నౌకను సురక్షితంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం 20 మంది సిబ్బందిని విడిపించారు.సంక్లిష్ట సముద్ర భద్రతా కార్యకలాపాలను నిర్వహించడంలో భారత నౌకాదళ సన్నద్ధతకు, దళాల మధ్య సమన్వయానికి ఈ విజయం నిదర్శనంగా నిలిచింది. నావికుల రక్షణ, కీలక సముద్ర వాణిజ్య మార్గాల భద్రత, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సుస్థిరమైన భద్రతా వాతావరణం కోసం కట్టుబడి ఉన్నట్లు భారత నౌకాదళం పేర్కొంది.

సమగ్ర సేద్యంతో రైతులకు నిత్యాదాయం సాధ్యమే

-మాజీ సైనిక మేజర్, ప్రకృతి వ్యవసాయ రైతు నవీన్ కుమార్ విజయగాథ స్ఫూర్తిదాయకం
-ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో చిరుధాన్యాలు, పశుగ్రాస పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి
-మురసు తుఫాను నేపథ్యంలో పంట కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్

నవంబర్ 3:ఐ రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యంతో పాటు పాడి పరిశ్రమ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను సమీకృతం చేసుకొని సాగు చేపట్టాలని, తద్వారా ప్రతిరోజూ ఆదాయం పొందేలా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం ద్వారా రైతులు నష్టాలను అధిగమించవచ్చని అన్నారు.

మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం 113వ ఎపిసోడ్‌లో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బడేపల్లికి చెందిన మాజీ సైనిక మేజర్, ప్రకృతి వ్యవసాయ రైతు సి.హెచ్. నవీన్ కుమార్ తన సమీకృత వ్యవసాయ విజయగాథను రైతులతో పంచుకున్నారు. భారత సైన్యంలో మేజర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం తన కుటుంబ సభ్యులతో కలిసి 15 ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. వరి, కూరగాయల సాగుతో పాటు పాడి పశువులు, నాటు కోళ్ల పెంపకం, చేపల పెంపకం, మునగ, నేపియర్ గడ్డి, బంతిపూల సాగు చేపడుతున్నారు. వర్మీ కంపోస్టు, వర్మీవాష్, ప్రకృతి వ్యవసాయ కషాయాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. తన వ్యవసాయ క్షేత్రంలో బయో రిసోర్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసి ఇతర రైతులకు సేంద్రియ



ఎరువులు, జీవ ఉత్పత్తుల తయారీకి అవసరమైన సామగ్రిని అందిస్తున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, నవీన్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సైన్యంలో దేశానికి సేవలందించిన అనంతరం వ్యవసాయ రంగంలోనూ ఆదర్శంగా నిలుస్తున్న ఆయన ప్రయాణం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సమీకృత వ్యవసాయ విధానాలను ఇతర రైతులు కూడా అనుసరించాలని, తమ భూమి, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించుకొని ప్రతి నీటి బొట్టును సమర్థంగా ఉపయోగించుకోవాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటల విషయంలో పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకోవాలని, తక్కువ నీటితో సాగు చేసుకునే చిరుధాన్యాలు, పశుగ్రాస పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించడంతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన సలహాలు అందించాలని సూచించారు. మురసు తుఫాను ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కోరారు. తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా పంట కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని, రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వాతావరణ, భూగర్భ జల, నీటిపారుదల శాఖల అధికారులు ఎల్‌నినో ప్రభావం, వర్షపాత పరిస్థితులు, భూగర్భ జలమట్టాలు, సాగునీటి ప్రాజెక్టులలో నీటి లభ్యతపై వివరించారు. అలాగే, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, పశుగ్రాస పరిశోధనా కేంద్రం, ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు యాసంగిలో తక్కువ నీటితో సాగు చేసుకునే చిరుధాన్యాలు, పశుగ్రాస పంటల సాగు, మామిడి తోటల్లో పూత, పిందె దశల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

రైతుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రసాయన పురుగుమందులను అవసరమైన మేరకు,

శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే వినియోగించాలని, పిచికారీ సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. పురుగుమందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ, పురుగుమందుల తయారీదారుల సంఘం రూపొందించిన 'ఇది చేయి--ఇది చేయవద్దు' భద్రతా చార్ట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో రైతులకు రక్షణ కిట్లను పంపిణీ చేశారు. అలాగే, యూపీఐ డిజిటల్ చెల్లింపుల వినియోగంపై ఎన్‌పీసీఐ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంత్రి మహబూబాబాద్ జిల్లాకు చెందిన రైతులతో ముఖాముఖి నిర్వహించి, రైతునేస్తం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని మరింత మెరుగుపరిచేందుకు రైతులు తమ సూచనలు అందించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఆర్టీసి ఎండి నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఔషధాల దిగుమతికి మరిన్ని ప్రవేశ కేంద్రాలు

సనత్‌నగర్, తిమ్మాపూర్ ఐసీడీలకు చోటు కల్పిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిపాదన

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

ఔషధాలు, వైద్య పరికరాలు, సౌందర్య సాధనాల దిగుమతులను సులభతరం చేసేందుకు అధీకృత ప్రవేశ కేంద్రాల విస్తరణను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదించింది. ఇందుకోసం ఔషధ నిబంధనలు--1945లోని రూల్ 43ఏను సవరించాలని నిర్ణయించింది. దిగుమతి సరుకుల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడం, రవాణా వ్యయాలను తగ్గించడం, ఆరోగ్య ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ఈ ప్రతిపాదన లక్ష్యం.

దేశంలోకి ఔషధాలను దిగుమతి చేసుకునేందుకు అనుమతించిన నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, రహదారి సరిహద్దు కేంద్రాలు తదితర ప్రవేశ ప్రాంతాలను రూల్ 43ఏ నిర్దేశిస్తుంది. ఈ జాబితాలో అదనంగా పలు ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలు (ఐసీడీలు), ఒక ప్రత్యేక ఆర్థిక మండలి, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేర్చాలని శాఖ ప్రతిపాదించింది.

తెలంగాణలో హైదరాబాద్‌లోని సనత్‌నగర్, తిమ్మాపూర్ ఐసీడీలు ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. హరియాణాలోని సోనిపట్, పియాలా, హర్సారు; ఉత్తర్‌ప్రదేశ్‌లోని దాద్రీ; గుజరాత్‌లోని గాంధీధామ్/ముంద్రా; కర్ణాటకలోని బెంగళూరు వైట్‌ఫీల్డ్ ఐసీడీలను కూడా చేర్చనున్నారు. కర్ణాటకలోని బొమ్మసంద్ర ప్రత్యేక ఆర్థిక మండలి, వాయుమార్గంలో ఔషధాల దిగుమతి కోసం ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయానికి చోటు కల్పించాలని ప్రతిపాదించారు.

ప్రస్తుతం అధీకృత దిగుమతి కేంద్రాలుగా ఉన్న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ పరిధిలోని ధన్నడ్, తిహి ఐసీడీలు, ఇప్పటికే నోటిఫై చేసిన విమానాశ్రయాలకు ఇవి అదనంగా చేరనున్నాయి.

ప్రతిపాదిత సవరణ అమల్లోకి వస్తే దిగుమతిదారులు తమ తయారీ కేంద్రాలు, గోదాములు, పంపిణీ కేంద్రాలకు సమీపంలోనే సరుకుల క్లియరెన్స్ పొందేందుకు అవకాశం కలుగుతుంది. అంతర్గత రవాణా దూరాలు, వ్యయాలు, సరుకుల తరలింపులో జాప్యం తగ్గుతాయని కేంద్ర ఆరోగ్య శాఖ భావిస్తోంది. తద్వారా అత్యవసర ఆరోగ్య ఉత్పత్తులు సకాలంలో అందుబాటులోకి రావడంతోపాటు వ్యాపార నిర్వహణ సులభతరం కానుంది.

విశాఖలో భారత్--అమెరికా 'టైగర్ ట్రయంఫ్--2026' ప్రారంభం

విపత్తు సహాయక చర్యల్లో సమన్వయమే లక్ష్యం..
తొలిసారిగా ఎన్‌డీఆర్‌ఎఫ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

భారత్--అమెరికా త్రివిధ దళాల సంయుక్త మానవతా సహాయం, విపత్తు సహాయక విన్యాసం 'టైగర్ ట్రయంఫ్--2026' ఐదో ఎడిషన్ సోమవారం విశాఖపట్నంలోని మారిటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో ప్రారంభమైంది. భారీ విపత్తుల సమయంలో ఇరు దేశాల సాయుధ దళాల మధ్య సమన్వయం, సంయుక్త ప్రణాళిక, కలిసి పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యం.

ఈ ఏడాది విన్యాసాన్ని 'టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్' రూపంలో నిర్వహిస్తున్నారు. ఊహాత్మక విపత్తు పరిస్థితుల ఆధారంగా సహాయక చర్యల ప్రణాళిక, బాధ్యతల సమన్వయంపై ఇందులో కసరత్తు చేస్తారు. ప్రారంభ కార్యక్రమానికి భారత



తూర్పు నౌకాదళ ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ విశాల్ బిష్ణోయ్, అమెరికా పసిఫిక్ ఫ్లీట్ వైస్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోక్విన్ జె. మార్టినెజ్ డి పినిల్లోస్ అధ్యక్షత వహించారు.

భారత్ తరఫున నౌకాదళంలోని వివిధ సముద్ర కార్యకలాపాల నిపుణులు, సైన్యానికి చెందిన భూతల బలగాలు, వైమానిక దళంలోని పలు విభాగాల ప్రతినిధులు, త్రివిధ దళాల ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొంటున్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందం తొలిసారిగా ఈ విన్యాసంలో భాగస్వామ్యం కానుంది.

అమెరికా తరఫున ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, మెరైన్ కోర్ ప్రతినిధులతోపాటు అంతరిక్ష, సైబర్, వైద్య, పేలుడు పదార్థాల నిర్వీర్య విభాగాల నిపుణులు పాల్గొంటున్నారు.

భారీ విపత్తుల సమయంలో వివిధ రంగాలకు చెందిన దళాలు సమష్టిగా స్పందించేందుకు అవసరమైన ప్రణాళికలు, కార్యాచరణ విధానాలపై ఈ విన్యాసం దృష్టి సారిస్తోంది. భారత్--అమెరికా మధ్య విస్తరిస్తున్న రక్షణ భాగస్వామ్యానికి, సముద్ర వ్యూహాత్మక ప్రయోజనాల్లో పెరుగుతున్న సహకారానికి ఇది ప్రతిబింబంగా నిలుస్తోంది.

గంజాయి నాటుసారా రవాణా పై ఉక్కుపాదం మోపుతాం సీఐ రాంప్రసాద్





మహబూబాబాద్ జిల్లా/ నవంబర్ 3
డిప్యూటీ కమీషనర్ దత్తురాజ్ గౌడ్ మరియు అసిస్టెంట్ కమిషనర్ నవీన్ చంద్ర ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ అధికారి కరంచంద్ గారి పర్యవేక్షణలో మహబూబాబాద్ లోని రైల్వే స్టేషన్ పరిసరాలు మరియు కురవిగేట్ సమీపంలో గంజాయి రవాణా పై సోదాలు నిర్వహించగా అనంతారం రోడ్డులో గల రైల్వే ట్రాక్ పక్కన చెట్ల పొదలలో (1.4)కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగింది.మరియు కురవి మండలంలోని భాంగ్యా తండా, రాయిని పట్నం,ఇస్లావత్ తండా గ్రామాలలో నాటుసారా పై నిర్వహించిన దాడులలో ఇద్దరు మహిళలు నాటుసారా తో పట్టుబడడం జరిగింది.అట్టి మహిళలపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుండి (10) లీటర్ల నాటుసారా,(50) కిలోల నల్లబెల్లం,(20) కిలోల పటిక ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.మరియు నాటుసారా కేసులలో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను కురవి, బయ్యారం ఎమ్మార్వోల ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేయడం జరిగింది.ఎవరైనా గంజాయి మరియు నాటుసారా అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపారు.ఇట్టి దాడులలో ఎస్ఐ శ్రీనివాస్, ట్రైనీ ఎస్ఐ ధనలక్ష్మీ మరియు కానిస్టేబుల్స్ నాగరాజు, గోపి, జాన్ పాషా పాల్గొన్నారు.

పాఠశాలలో మురుగు నీటి నిల్వ తరలింపునకు ప్రత్యేక చర్యలు



మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో మురుగు నీరు చేరుతోంది. పాఠశాల ముందున్న డ్రైనేజీలో ముందుకు వెళ్లడం పోవడంతో మురుగు నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు పెరిగి అనారోగ్యాలు కలిగే ప్రమాదం ఉందని అధికారుల దృష్టి తీసుకెళ్లారు. అయితే సమీపనా ఆనుకొని ఉన్న పంట పొలాల రైతుల పంట పొలాలకు మురుగు నీరు చేరుతుండటంతో మురుగు నీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో సమస్య ఉత్పన్నమైంది. ఈ మేరకు మంగళవారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఎంపీడీవో సులోచన, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవంతి లు కలిసి మురుగు నీరు నిల్వ గుంత వద్ద పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... విద్యార్థుల ఆరోగ్యం మరియు పరిశుభ్రత దృష్ట్యా శాశ్వత పరిష్కారం చూపడానికి పంట పొలాలకు వెళ్లకుండా, అంతర్గత కాలువలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు కిస్టల్, వెంకటేష్, మారపల్లి మంజుల శ్రీను, నాయకులు రషీద్, మట్ట భరత్ గౌడ్, కొండల్, పాఠశాల ఉపాధ్యాయులు తదితర నాయకులు ఉన్నారు.

లక్షా 19వేల ఓట్ల ఆధిక్యంలో విశాఖ తెదేపా మేయర్ అభ్యర్థి



విశాఖపట్నం: ఏపీలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ విశాఖపట్నంలో తెదేపా దూసుకెళ్తోంది. నగరపాలక సంస్థ ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీకి చెందిన మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి..సమీప వైకాపా అభ్యర్థి వరుదు కల్యాణి కంటే 1,19,683 ఓట్ల అధిక్యంలో దూసుకెళ్తున్నారు. ఇప్పటి వరకు 4,36,676 ఓట్లు లెక్కించగా.. తెదేపా (ఎ్ఞా) అభ్యర్థికి 2,56,881, వైకాపా 1,37,194, కాంగ్రెస్ 5,434, ఇతరులు 37,163 ఓట్లు సాధించారు. విశాఖలో మొత్తం 120 డివిజన్లకు గానూ తెదేపా – 27, జనసేన – 10, భాజపా – 5, వైకాపా – 4, ఇతరులు – 2 చోట్ల విజయం సాధించారు. ఇప్పటివరకు 42 డివిజన్లలో గెలుపొందగా, మరో 24 డివిజన్లలో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో స్నేక్ ప్లాంట్ మొక్కల నాటే కార్యక్రమం



పర్యావరణ పరిరక్షణలో భాగంగా లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ కార్యాలయం (ఎంపీపీ) ఆవరణలో బుధవారం స్నేక్ ప్లాంట్ మొక్కలను నాటారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో ఏఓ, డిప్యూటీ ఎంపీడీవో (ఎస్‌జీఎస్‌డబ్ల్యూ) కలిసి మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. కార్యాలయ పరిసరాలను పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ములకల్లంకలో కుండపోత వర్షంలోనూ కొనసాగిన జడ్పీటీసీ అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి ప్రచారం





స్థానిక మండలంలోని ములకల్లంక గ్రామంలో కూటమి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కురుస్తున్న జోరువానను సైతం లెక్కచేయకుండా గడపగడపకూ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో మండల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గా దొడ్డా అచ్చమ్మ ఘన విజయం



సోమవారం వెలువడిన మాచర్ల మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 29వ వార్డు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దొడ్డా అచ్చమ్మ 795 ఓట్లతో ఘన విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధి కి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. విజయం సాధించిన అచ్చమ్మ కి పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

కుటుంబానికి కష్టకాలంలో బీమా అండ.. రూ.2 లక్షల పరిహారం అందజేత

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకం ద్వారా ఆర్థిక సాయం

మృతుడి నామిని నాగిళ్ల జ్యోతికి చెక్కు అందజేత





ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం అండగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందింది.కుర్మేడ్ గ్రామానికి చెందిన నాగిళ్ల బాబయ్య ప్రమాదవశాత్తు మృతి చెందడంతో, మృతుడి పేరుతో ఉన్న బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్షల మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుడి భార్య నాగిళ్ల జ్యోతికి పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు అందజేశారు. కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఈ ఆర్థిక సాయం కొంతమేర అండగా నిలవనుంది.ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ కిషోర్, క్లస్టర్ కో-ఆర్డినేటర్ నాగరాజు, కాశయ్య, కొండమల్లేపల్లి సీ.ఎఫ్.ఎల్. కౌన్సిలర్లు అంకులమ్మ, మహేష్, హేమ పాల్గొన్నారు. అలాగే కుర్మేడు గ్రామ సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ లాలయ్య, పంచాయతీ కార్యదర్శి శైలేందర్, గ్రామస్తులు హాజరయ్యారు.

నవంబర్ 4న 'ఈ--ఫైలింగ్ 3.0'పై కార్యశాల

ప్రభుత్వ అధికారులకు డిజిటల్ న్యాయసేవలపై అవగాహన.. హాజరుకానున్న అర్జున్‌రామ్ మేఘ్వాల్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

న్యాయ ప్రక్రియల్లో సాంకేతిక వినియోగాన్ని విస్తరించే లక్ష్యంతో కేంద్ర న్యాయ శాఖ 'ఈ--ఫైలింగ్ 3.0: ప్రక్రియ నుంచి ఆచరణకు' అంశంపై బుధవారం కార్యశాల నిర్వహించనుంది. నవంబర్ 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి న్యూఢిల్లీలోని మౌలానా ఆజాద్ రోడ్డులో ఉన్న విజ్ఞాన్ భవన్ హాల్ నంబర్ 5లో ఈ కార్యక్రమం జరగనుంది.

ఈ--కోర్ట్స్ మిషన్ మోడ్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న కార్యశాలకు కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) అర్జున్‌రామ్ మేఘ్వాల్ హాజరుకానున్నారు. సుప్రీంకోర్టు ఈ--కమిటీ సభ్యులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ప్రభుత్వ అధికారులకు ఈ--ఫైలింగ్ 3.0 వేదిక వినియోగంపై ఆచరణాత్మక అవగాహన కల్పించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఆధ్వర్యంలో సాంకేతిక సెషన్లు నిర్వహించనున్నారు. ఈ--కోర్ట్స్ ప్రాజెక్టు పరిధిలోని అప్లికేషన్లు, సేవలు, సింగిల్ సైన్‌ఆన్ విధానం, ఈ--కోర్ట్స్ సర్వీసెస్ మొబైల్ యాప్‌పై వివరించనున్నారు. ఈ--ఫైలింగ్ 3.0లో ప్రభుత్వ న్యాయవాదులు, ప్రభుత్వ విభాగాలకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిచయం చేయనున్నారు. పాల్గొనే అధికారులతో బహిరంగ చర్చ కూడా ఉంటుంది.

ఈ--కోర్ట్స్ మూడో దశ ప్రాజెక్టు పూర్తిస్థాయి డిజిటల్, కాగితరహిత న్యాయస్థానాలు, పౌర కేంద్రిత ఆన్‌లైన్ న్యాయసేవలను లక్ష్యంగా పెట్టుకుంది. అన్ని కోర్టుల్లో ఈ--ఫైలింగ్ వినియోగాన్ని విస్తరించడం ఇందులో కీలక అంశం.

కోర్టు వ్యాజ్యాల్లో ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, అనుబంధ కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, నియంత్రణ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల వాటా గణనీయంగా ఉంది. ఆయా సంస్థలు ఈ--ఫైలింగ్‌ను విస్తృతంగా వినియోగిస్తే పనితీరు మెరుగుపడటంతోపాటు భౌతిక పత్రాలు, ప్రత్యక్ష ప్రక్రియలపై ఆధారపడటం తగ్గుతుందని న్యాయ శాఖ తెలిపింది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని సంబంధిత అధికారులకు అందించేందుకు ఈ కార్యశాల నిర్వహిస్తోంది.

శాసన మండలి ప్రాంగణంలో ప్రతిపాదిత అభివృద్ధి, సుందరీకరణ ప్రణాళికలను పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం రాష్ట్ర శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, అక్కడ ప్రతిపాదించిన అభివృద్ధి, సుందరీకరణ పనులు ప్రణాళికలపై హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్‌లతో పాటు శాసనసభ కార్యదర్శి, శాసన మండలి కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనల వివరాలను తెలుసుకున్నారు. అలాగే, శాసనసభ ప్రాంగణానికి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, అనుబంధ భవనం ఏర్పాటు, ఇతర అనుబంధ సౌకర్యాల అభివృద్ధి అంశాలను కూడా తెలుసుకున్నారు. ప్రస్తుతం పర్యాటక శాఖకు చెందిన భూమిని శాసనసభకు బదిలీ చేయడంతో పాటు, పక్కనే ఉన్న డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమిని కూడా శాసనసభకు బదిలీ చేసే అంశంపై కూడా చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిపాదిత అభివృద్ధి పనులకు గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలపై సమీక్షించారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు, ప్రస్తుత స్థల పరిస్థితులు, ఇంజినీరింగ్ అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ ప్రాజెక్టులో పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలను అనుసరించాలని గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న పచ్చదనానికి ఎలాంటి విఘాతం కలగకుండా, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గిస్తూ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్ అండ్ బీ ఎస్.సి మాధవి, ఈ ఈ మనోహర్ బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌లో ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరాలు.. ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని వోటర్ రైట్స్ ఫోరం డిమాండ్



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబర్ 3: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీగా అక్రమ తొలగింపులు జరిగాయని తెలంగాణ వోటర్ రైట్స్ ఫోరం (ఎఫ్ఆర్) ఆరోపించింది. ఈ ప్రక్రియలో ఎదురైన లోపాలు, బాధిత ఓటర్ల అనుభవాలను మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ముషీరాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సామాజిక ఆడిట్, ప్రజా విచారణల ఆధారంగా పలు కీలక అంశాలను బయటపెట్టింది.

ఫోరం ప్రతినిధి డాక్టర్ ఎ. సునీత వివరాల ప్రకారం, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని 150, 151 బూత్‌ల పరిధిలో 757 మంది ఓటర్లను ప్రత్యక్షంగా సర్వే చేయగా, 232 మంది పేర్లు తొలగింపు జాబితాలో ఉన్నాయని, వారిలో 43 మంది ఓట్లు అన్యాయంగా తొలగించబడ్డాయని గుర్తించారు. మరో 383 మందికి నోటీసులు అందాయి. ముషీరాబాద్‌లో సర్వే చేసిన 95 మంది తొలగించబడిన ఓటర్లలో 42 మంది ఓట్లు అన్యాయంగా తొలగించినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో బాధిత ఓటర్లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఏళ్లుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నప్పటికీ, తమ పేర్లను 'అందుబాటులో లేరు' అనే కారణంతో తొలగించారని వాపోయారు. ప్రజా విచారణలో పాల్గొన్న ప్రొఫెసర్ జి. హరగోపాల్, డాక్టర్ పరాకాల ప్రభాకర్, ప్రొఫెసర్ పద్మజా షా, మరియా తబస్సుమ్, సిస్టర్ మంజుల, న్యాయవాది ఎస్.క్యూ. మసూద్ తదితరులు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను ఎత్తిచూపారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌లో చేసిన వ్యాఖ్యలను డాక్టర్ పరాకాల ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. తొలగించిన ఓటర్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలంటే వోటర్ రైట్స్ ఫోరం నిర్వహించిన ప్రజా విచారణలను సందర్శించాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ వలసదారుల పేరుతో ఓటర్ల తొలగింపును సమర్థించడం సరికాదని విమర్శించారు. ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌లో మహిళలు, మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, కార్మిక వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కాపాడేందుకు ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా వెనక్కి తీసుకోవాలని, 2025 మార్గదర్శకాలను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, 2023 ఎన్నికల కమిషన్ చట్టాన్ని రద్దు చేయాలని ఫోరం డిమాండ్ చేసింది. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ప్రస్తుత లోపభూయిష్ట ఓటర్ల జాబితాలను ఉపయోగించకుండా, 2025 ఓటర్ల జాబితా ఆధారంగా ప్రజా ఆడిట్ నిర్వహించి కొత్త జాబితాలను రూపొందించాలని కోరింది.

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ టవర్స్ పూర్తి

ఇందిరమ్మ ఇండ్లకు మరిన్ని భూములను గుర్తిస్తున్నాం
హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
ఈ-లాటరీ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో
1920 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక
14 నియోజకవర్గాల్లో ఖాళీల భర్తీకి నేడు (బుధవారం) మరోసారి లాటరీ



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబర్ 3 : హైదరాబాద్ లో సొంతంగా ఇండ్లు నిర్మించుకోడానికి భూములు కలిగి ఉండి అర్హులైన వారికి కూడా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. పేదల సొంత ఇంటికలను నిజం చేయడానికి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 5500 ఇండ్లను మంజూరు చేసిందని, అయితే హైదరాబాద్ వంటి మహానగరంలో స్థలాల లభ్యత తక్కువగా ఉన్నందున, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను పేదల నివాసాల కోసం వినియోగిస్తూ ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు.

గోషామహల్, ముషీరాబాద్, ఎల్.బి.నగర్, చంద్రాయణ గుట్ట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కేటాయింపు లాటరీని మంగళవారం నాడు శాసనభ్యులు రాజాసింగ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఈ-లాటరీ విధానంలో ఈ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 1920 ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నేడు లాటరీ తీసిన ప్రాంతాల్లో ఇండ్లనిర్మాణ పనులకు త్వరలోనే భూమి పూజ నిర్వహిస్తామన్నారు. పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేసే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ఆర్టీసీ భూములను కూడా ఇచ్చామని అలాగే పోలీసు శాఖ కు చెందిన భూములను సైతం వినియోగిస్తున్నామన్నారు. మొత్తం లక్ష ఇండ్ల నిర్మాణాలను చేపట్టేందుకు అనువైన భూములన్నిటినీ కూడా సేకరిస్తున్నామని ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వచ్చే బోనాల నాటికల్లా గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గోషామహల్ శాసనసభ్యులు రాజాసింగ్ మాట్లాడుతూ ఏ నియోజకవర్గంలో నివసిస్తున్న పేదలకు ఆ నియోజకవర్గంలోనే సొంత ఇంటి వసతి కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం చాలా మంచిదన్నారు. నియోజకవర్గంలో ఇంకా అనేక చోట్ల గృహనిర్మాణాలకు అనువైన భూములను గుర్తిస్తున్నామని ఉన్నాయని వాటిలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపి గౌతం మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి సొంత ఇంటి వసతిని కల్పించేంతవరకు ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మాణాలను నిరంతరం చేపడతామని అన్నారు. అపుటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ ఇండ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులను కూడా భాగస్వామ్యులను చేసి, వారి పర్యవేక్షణలో నిర్మాణపు పనులు పూర్తి కావాలన్న ఉద్దేశ్యంతోనే నామమాత్రంగా ఆరు లక్షల రూపాయల ధరను నిర్ధారించామన్నారు. బహిరంగ మార్కెట్ లో 40-50 లక్షల విలువ చేసే ఇంటిని నామమాత్రపు ధరకే అందించడమే కాకుండా, రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేయాలని నిర్ణయించామన్నారు. ఇండ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా ఈ-లాటరీ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఈ లాటరీ లో ఎంపికైన వారికి వెనువెంటనే ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం చేరే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు.

నేడు (బుధవారం) మాప్ అప్ లాటరీ

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల కోసం పైలట్ ప్రాజెక్టు లో భాగంగా ఇప్పటికే లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు పూర్తి అయిన 16 నియోజకవర్గాల్లో, క్షేత్ర స్థాయి పర్యటనల్లోనూ, ఇతర కారణాల్లోనూ రద్దు అయిన ఇండ్లను మాప్ అప్ లాటరీ ద్వారా లబ్ధిదారులకు నవంబర్ నాలుగో తేదీ (బుధవారం) నాడు చేపట్టనున్నారు. గతంలో 16 నియోజకవర్గాల్లో ఇండ్లను కేటాయించగా, వాటిలో 14 నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో సుమారు 1700 ఇండ్లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాలోని పేర్ల తోటే ఈ-లాటరీ నిర్వహిస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని

-రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెండింగ్ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు టిమ్స్ అల్వాల్, టిమ్స్ ఎల్‌బీ నగర్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి సమీక్ష చేశారు. సెక్రటేరియట్‌లో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్పిటల్‌లో ప్రతి ఫ్లోర్ ప్లాన్‌ను మంత్రి పరిశీలించారు. తొలుత అవుట్ పేషెంట్ వైద్య సేవలు ప్రారంభించనున్న నేపథ్యంలో, ఇందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ డెస్క్‌లు, ఓపీ కన్సల్టేషన్ రూమ్‌లు, ఫార్మసీ, డయాగ్నస్టిక్స్ తదితర సేవలకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి అవుట్ పేషెంట్ సేవలకు సంబంధించిన అన్ని పనులు పూర్తవుతాయని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. 6 ఆపరేషన్ థియేటర్లు సైతం సిద్ధమవుతాయని తెలిపారు. ఒక్కసారి పేషెంట్ హాస్పిటల్‌కు వచ్చాక, మరో హాస్పిటల్‌కు రిఫర్ చేసే ప్రసక్తే ఉండకూడదని, అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా హాస్పిటల్‌లో సౌకర్యాలు ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నియమించిన డాక్టర్ల బృందం వరంగల్ హాస్పిటల్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటళ్లను రెగ్యులర్‌గా విజిట్ చేయాలని మంత్రి ఆదేశించారు. అల్వాల్ టిమ్స్ పనులు సైతం చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ జరుగుతోందని తెలిపారు. ఈ ఏడాది మార్చి నాటికి ఎల్‌బీ నగర్ టిమ్స్ పనులు చివర దశకు వస్తాయని అధికారులు తెలిపారు. పనులన్నీ స్పీడప్ చేయాలని, వీలైనంత త్వరగా హాస్పిటళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కేంద్ర పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి

కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో రాబట్టేందుకు కృషి చేయాలి
కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్యాలు నెరవేరాలి..
ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందాలి
కేంద్ర శాఖలతో నిరంతర సమన్వయం చేసుకోవాలి:
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 3:

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేంద్ర పథకాల కింద కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ఆశించిన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ సెక్టార్, సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ అమలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, పెండింగ్ బిల్లులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి నిధులు పొందేందుకు ఉన్న అన్ని అవకాశాలను శాఖలవారీగా గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను సకాలంలో సమర్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల మార్గదర్శకాలను పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని, కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిధుల సాధనకు కృషి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి గరిష్ఠ స్థాయిలో నిధులు రాబట్టుకోవాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగం, పురోగతిని సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి.. కేంద్రం కేటాయించిన నిధులను సమర్థవంతంగా ఖర్చు చేయడంతో పాటు, వాటి ద్వారా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులను సమకూరుస్తున్నందున, నిధుల ఖర్చుపైనే కాకుండా వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, ప్రజలకు కలుగుతున్న
ప్రయోజనాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న లైజన్ అధికారుల సేవలను అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి నిధుల విడుదల సాధించడంతో పాటు, పెండింగ్ అంశాల పరిష్కారానికి వారితో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వివిధ కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో ప్రస్తావించిన అంశాలపై కూడా సకాలంలో తదుపరి చర్యలు తీసుకుంటూ, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆదేశించారు. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందించే ప్రత్యేక సహాయ పథకం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) వంటి కేంద్ర కార్యక్రమాలను రాష్ట్రం గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. పథకాల అమలుకు ఆటంకంగా ఉన్న పెండింగ్ సమస్యలు, సాంకేతికపరమైన ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రవాణా, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తద్వారా ఆయా పథకాల కొనసాగింపునకు, అదనపు నిధుల సాధనకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులను సకాలంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. అన్ని బిల్లులను క్రమశిక్షణతో క్లియర్ చేస్తున్నామని వివరించారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల ప్రస్తుత పరిస్థితి, పురోగతి, నిధుల వినియోగంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

తుఫాన్లను సమర్థంగా ఎదుర్కొన్నాం.. 4-5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ: సీఎం చంద్రబాబు



అమరావతి, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టం సంభవించినప్పటికీ, ప్రాణనష్టాన్ని నివారించడంతో పాటు ఆస్తినష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడంలో ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అర్నబ్, మురసు తుఫాన్ల సమయంలో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, అధికార యంత్రాంగం పనితీరును ఆయన వివరించారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. తుఫాన్లను ఎదుర్కోవడంలో ముందస్తు అంచనాలు, పక్కా ప్రణాళిక, సమన్వయం కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

రెస్క్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్ (రక్షణ, సహాయక చర్యలు, పునరావాసం) అనే మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించి పనిచేశామని చంద్రబాబు వెల్లడించారు. రెండు తుఫాన్ల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, గాలుల వేగం, వర్షపాతం, వరద ముప్పును విశ్లేషించి సహాయక చర్యలకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సమన్వయంతో పనిచేశామన్నారు.

ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయిలోని అధికారులకు ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని అందించగలిగామని సీఎం తెలిపారు. అవేర్ వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గాలుల వేగం, వర్షపాతం అంచనాలు, వరద నిర్వహణ, నీటి నిర్వహణ వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ రూపొందించామన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులతో పోల్చి చూసినప్పుడు తమ అంచనాలు దాదాపు 90 శాతం మేర వాస్తవమయ్యాయని వెల్లడించారు. తుఫాన్ల ప్రభావానికి గురయ్యే గ్రామాలు, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడికి అవసరమైన సహాయక సిబ్బంది, పరికరాలను తరలించామని చంద్రబాబు వివరించారు. ముందస్తు అంచనాల ఆధారంగా తీసుకున్న చర్యల వల్ల ప్రభావిత ప్రాంతాల్లో త్వరగా సాధారణ పరిస్థితులను పునరుద్ధరించగలిగామని చెప్పారు.

విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం

తుఫాన్ల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. అలాగే 548 సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు ఇంత భారీ నష్టం జరిగిన నేపథ్యంలో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి కనీసం 20 రోజులు పడుతుందని అంచనా వేసినప్పటికీ, పక్కా ప్రణాళికతో కేవలం నాలుగైదు రోజుల్లోనే విద్యుత్ సరఫరాను చాలావరకు పునరుద్ధరించగలిగామని సీఎం చెప్పారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ నిరంతరం పనిచేశారని ప్రశంసించారు.

భారీ వర్షాలు కురుస్తున్న సమయంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులను కొనసాగించామని తెలిపారు. అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తూ, దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి పనులను వేగవంతం చేశామని చెప్పారు. ఆక్వా చెరువుల్లోనూ విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో పునరుద్ధరణ పనులు మరింత సవాలుగా మారాయని వివరించారు.

విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం

తుఫాన్ సహాయక చర్యల్లో విద్యుత్ శాఖ సిబ్బంది చేసిన సేవలను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతికూల వాతావరణంలో, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ ప్రాణాలను పణంగా పెట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు అమలు చేయడం వల్లే తుఫాన్ల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని త్వరగా కోలుకునేలా చేయగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తే సైబర్ నేరాలకు అసలైన రక్షణ!

యాదాద్రి భువనగిరి, నవంబరు03/ట్రైనెట్ న్యూస్:



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణ, సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ఎవరితోనూ ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు,యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా ఎఎవపతీ-ఎతీఅఎవ.గ్ఞశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఎస్ఐలు నాగరాజు, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల మండల స్థాయి క్రీడల నిర్వహణ

యాదాద్రి భువనగిరి, నవంబరు03/ట్రైనెట్ న్యూస్:





యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం లోని భవిత కేంద్రం నందు దివ్యాంగుల మండల స్థాయి క్రీడాకారుల ఎంపికకు సంబంధించి క్రీడల్ని మండల విద్యాధికారి పి.వెంకట రామి రెడ్డి ప్రారంభించడం జరిగినది. ఇట్టి క్రీడలలో మండల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుంది అని తెలిపారు.వీరికి ఈ నెల 6వ తేదీన జిల్లా స్థాయిలో దివ్యాంగుల క్రీడాకారుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకట్ రెడ్డి,యం డి మాక్సూద్ అలీ,ప్రధానోపాధ్యాయులు సిహెచ్.చిత్తరంజన్,ఐఈఆర్పీ సిహెచ్ బాలరాజు, ఉపాధ్యాయులు లలిత,శ్రీను, రాణి,తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగూడ రోడ్డుపై ఆటో టిఫిన్ సెంటర్ల దందా

- రాత్రి వేళ రహదారిపై యథేచ్ఛగా ఆక్రమణలు.. వాహనదారులకు ట్రాఫిక్ నరకం
- పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఒక్కో ఆటో టిఫిన్ సెంటర్ నుంచి నెలకు రూ.10 వేల మామూళ్ల వసూళ్ల ఆరోపణలు



మెట్టుగూడ ప్రధాన రహదారి రాత్రి వేళల్లో ఆటో టిఫిన్ సెంటర్లకు అడ్డాగా మారుతోంది. పగటిపూట వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై రాత్రి 7 గంటలు దాటిందంటే చాలు.. ఆటో టిఫిన్ సెంటర్ల వ్యాపారం మొదలవుతోంది. ఆటోల్లోనే స్టవ్‌లు, ప్లేట్లు ఇతర సామగ్రిని ఏర్పాటు చేసుకుని రహదారి పక్కన, చివరకు రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, ప్రయాణికులకు అవస్థలు

టిఫిన్ సెంటర్లకు వచ్చే వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను రహదారిపైనే నిలిపివేస్తుండగా, మరోవైపు ఆటోలను అడ్డంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్తలు వచ్చినా మారని పరిస్థితి, డోంట్ కేర్ అంటున్నారా.?

మెట్టుగూడ రహదారిపై ఆటో టిఫిన్ సెంటర్ల ఆక్రమణలు, ట్రాఫిక్ ఇబ్బందులపై గతంలో పలు పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో రాత్రివేళ రహదారిపై వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ పరిస్థితి కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నెలకు రూ.10 వేల మామూళ్లు.?

ఈ వ్యవహారంలో మరో సంచలన ఆరోపణ తెరపైకి వస్తోంది. ఒక్కో ఆటో టిఫిన్ సెంటర్ నుంచి నెలకు రూ.10 వేల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకోవడం లేదని కొందరు వాహనదారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల స్పందన ఎక్కడ.?

మెట్టుగూడ ప్రధాన రహదారిని ఆక్రమించి నిర్వహిస్తున్న ఆటో టిఫిన్ సెంటర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి రహదారి ఆక్రమణలను తొలగించడంతో పాటు రాత్రివేళ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, రోడ్డుని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వాళ్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మామూళ్ల ఆరోపణలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ బియ్యంపై అక్రమార్కుల కన్ను

- రాజకీయ నాయకుల కనుసైగల్లోనే
- అక్రమార్కులను కట్టడి చేయడంలో ప్రభుత్వ శాఖలు విఫలం
- రేషన్ బియ్యం అక్రమ దందాకు కొంతమంది అధికారుల అండదండలు
- నగరంలో,నగర శివారుల్లో రేషన్ బియ్యం దందా జోరు
- గోదాంలకు తరలింపు.. బ్రాండెడ్ సంచుల్లో రీ ప్యాకింగ్
- బియ్యం ధరలకు రెక్కలు రావడంతో పెరిగిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం
- సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ ఏది.? టాస్క్‌ఫోర్స్ దాడులు నామమాత్రమేనా.?



పేదలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు అందించాల్సిన ఉచిత బియ్యం పక్కదారి పడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరం తో పాటు నగర శివారుల్లోని గోదాంలకు చేరుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు దాదాపు 80 రూపాయలకు భారీగా పెరగడంతో రేషన్ బియ్యానికి డిమాండ్ పెరిగి అక్రమ వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం అక్రమార్కుల వ్యాపారానికి కేంద్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

బ్రాండెడ్ సంచుల్లో రేషన్ బియ్యం

అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని గోదాంలలో నిల్వ చేసి, ఇతర బ్రాండ్ల పేర్లతో ఉన్న సంచుల్లో నింపి యదేచ్ఛగా మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని సేకరించడం, నిల్వ చేయడం, రీ ప్యాకింగ్ చేయడం, ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వంటి వ్యవహారాలు వ్యవస్థీకృతంగా సాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందా వెనుక ఎవరున్నారు.? ఎక్కడి నుంచి బియ్యం వస్తోంది.? ఎవరికి సరఫరా చేస్తున్నారు.? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం పూర్తిగా కరువవుతోంది. ఉదయం 3 గంటల నుండి తెల్లవారు 7 గంటల వరకు ఈ దందా దర్జాగా సాగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

శివారుల్లో భారీ షెడ్లు, గోదాంలే అడ్డాలు

బొంగులూరు గేట్, మంగళపల్లి, బడంపేట్, ఆదిబట్ల, నాదర్గుల్, జల్పల్లి, కాటేదాన్, మహేశ్వరం, ఆమనగల్, కల్వకుర్తి, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, పురానాపూల్, నాగోల్, బండ్లగూడ, తుర్కయంజాల్, షామీర్‌పేట్, గజ్వేల్, రామవరం, ఘట్‌కేసర్, భువనగిరి, మౌలాలి, మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో భారీ షెడ్లు, గోదాంలలో బియ్యం నిల్వలు ఉన్నాయనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో గోదాంల కార్యకలాపాలపై సివిల్ సప్లై అధికారులకు, స్థానిక పోలీసులకు పూర్తిస్థాయి సమాచారం ఉండి కూడా చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి సమగ్ర తనిఖీలు చేపడితే అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు గుట్టు బయటపడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పత్రికల్లో కథనాలు వచ్చినా కదలని యంత్రాంగం

కొంతమంది రాజకీయ నాయకుల ప్రజాప్రతినిధుల కనుసైకిల్లో జరిగే

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పలు సందర్భాల్లో పత్రికల్లో కథనాలు వెలువడుతున్నప్పటికీ పలు శాఖల అధికారుల్లో ఆశించిన స్థాయిలో కదలిక కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కొంత బియ్యం పట్టుకోవడం మినహా, ఈ అక్రమ వ్యాపారం మూలాలను ఎందుకు ఛేదించలేకపోతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్న వాళ్లపై ఐదు కేసుల పైనే ఉన్న వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ఉన్నతాధికారులకే తెలియాలి. చిన్న స్థాయి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటే సరిపోతుందా.? పెద్ద మొత్తంలో బియ్యం నిల్వ చేస్తున్న గోదాంల యజమానులు, సరఫరాదారులపై విచారణ ఎందుకు జరగడం లేదని, రాత్రి, తెల్లవారుజాము 3 గంటల తర్వాత రోడ్లపై రేషన్ బియ్యం సరఫరా జరుగుతుంటే అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్ల బాధ్యతరాహిత్యానికి నిదర్శనమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదల బియ్యం అక్రమార్కుల పాలు

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రవాణా మార్గాలపై నిఘా, గోదాంల తనిఖీలు, నిల్వల రికార్డుల పరిశీలన, రీ ప్యాకింగ్ కేంద్రాల గుర్తింపు చేపట్టాల్సిన బాధ్యత సివిల్ సప్లై శాఖపై ఉంది. అక్రమ రవాణాకు సహకరిస్తున్న వారెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో సంయుక్త దాడులు నిర్వహించాలి. పత్రికలో కథనాలు వచ్చిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చోద్యం చూడడం వెనక ముందుగానే వాళ్లకు కావలసింది అందాయ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల గోదాంలలో ఎందుకు మూలుగుతోంది.? అధికారుల నిఘా ఎక్కడ.? టాస్క్‌ఫోర్స్ దాడులు నిజంగానే అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తున్నాయా.? లేక దాడుల పేరుతో కాలయాపన చేస్తున్నారా.? సివిల్ సప్లై శాఖ మంత్రి, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భారీ షెడ్ నిర్మాణంపై అధికారుల దృష్టి పడేనా?





- సాయి ప్రియ కాలనీలో నిర్మాణ పనులపై స్థానికుల ఆందోళన
- అనుమతుల వివరాలు బహిర్గతం చేయాలని విజ్ఞప్తి
- ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ సాయి ప్రియ కాలనీలో చేపడుతున్న భారీ షెడ్ నిర్మాణం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందారా? మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగానే పనులు చేపడుతున్నారా? అన్న సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. భారీ విస్తీర్ణంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులపై అధికారుల స్పష్టత ఏదీ?

సదరు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, వాణిజ్య కార్యకలాపాలకు వర్తించే నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్లు తేలితే మున్సిపల్ ఆదాయానికి గండి పడటంతో పాటు పట్టణ ప్రణాళిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. సామాన్యులు చిన్నపాటి నిర్మాణాలకు సైతం అనుమతులు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, భారీ షెడ్ నిర్మాణం విషయంలో అధికారుల పర్యవేక్షణ ఎక్కడుందంటూ ప్రశ్నిస్తున్నారు.

డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించాలి!

సాయి ప్రియ కాలనీలో కొనసాగుతున్న భారీ షెడ్ నిర్మాణంపై కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులు, భూమి వినియోగం, నిర్మాణ నిబంధనలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి ఉపేక్ష లేకుండా పారదర్శకంగా వ్యవహరించి, మున్సిపల్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శంకరంపేట-ఆర్, చేగుంట పోలీస్ స్టేషన్లపై అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలి
- డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్





నేరాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శంకరంపేట–ఆర్, చేగుంట పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జజుచీ, ఈ–సాక్ష్య అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. డ్రగ్స్ దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యపరచాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఈ తనిఖీలలో తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, శంకరంపేట–ఆర్ ఎస్ఐ శివనందం, చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం..

సమావేశానికి తాసిల్దార్ హాజరుకాలేదని బై కట్ చేసిన సర్పంచ్‌లు...





చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం ఇప్పటివరకు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ సమావేశానికి ప్రత్యేక అధికారి హేమ భార్గవి హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించగా, మధ్యలో సర్పంచులు లేచి స్థానిక తహసిల్దార్ సమావేశానికి ఎందుకు హాజరు కావడం లేదని, గౌరవ ఎమ్మెల్యేలు హాజరైన కూడా ఏ ఒక్క సమావేశానికి హాజరు కావడం లేదని, అందర్నీ కించపరిస్తున్నట్లు చేస్తున్నారని గౌరవ సర్పంచులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వశే ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించింది. అందులో భాగంగా ఈ సాధారణ సమావేశంలో తాసిల్దార్ గారు చేగుంట మండలాన్ని కరువు మండల్ గా తీర్మానం చేసి సంబంధిత అధికారులకు పంపించేలా చూస్తారు అనుకుంటే, ఎప్పుడు అవమానించేలా చేస్తున్నారని సర్పంచులు స్థానిక ఎంపీడీవో, ప్రత్యేక అధికారులతో ఆరోపించారు. అనంతరం సర్పంచులు సాధారణ సమావేశాన్ని బై కట్ చేశారు.

షాద్‌నగర్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'ఓటు' ఒక బలమైన ఆయుధం: టీఆర్ఎస్ షాద్‌నగర్ ఇన్‌చార్జి సీమల రమేష్ కురుమ పిలుపు



రాబోయే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ షాద్‌నగర్ ఇన్‌చార్జి సీమల రమేష్ కురుమ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు అనేది బాధ్యత మాత్రమే కాదని, పాలకులను ప్రశ్నించే ఒక శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై ప్రశ్నించే గొంతుకగా నిలబడాలన్నా, పట్టభద్రుల సమస్యలు శాసనమండలిలో గొంతెత్తి చాటాలన్నా ఓటు హక్కు నమోదు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఈ ఓటరు నమోదు కార్యక్రమానికి అర్హులని ఆయన తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని యువకులు, మహిళలు మరియు ఉద్యోగార్థులు తక్షణం తమ పేర్లను గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని, రాబోయే ఎన్నికల్లో బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సీమల రమేష్ కురుమ కోరారు.

నూతన ప్రభుత్వ దవాఖానా భవన నిర్మాణ పనుల పరిశీలనలో జువ్వాడి కృష్ణారావు

●ప్రజలకు మరింత ఉపయోగకరంగా నూతన దవాఖానా భవనం ఉండేలా చర్యలు తీసుకోవాలి -- అధికారులకు సూచన



మెట్‌పల్లి పట్టణంలోని నూతన దవాఖానా ప్రభుత్వ భవనాన్ని జువ్వాడి కృష్ణారావు సందర్శించి, అక్కడి వసతులను, కొనసాగుతున్న పనులను పరిశీలించారు. నూతన భవనం ప్రజలకు గతంలో కంటే మరింత ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రజలకు మేలు జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతుండటాన్ని ఓర్వలేక కొందరు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఓట్ల కోసం కాకుండా ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం నిర్మించిన ఆసుపత్రులపై రాజకీయాలు చేయవద్దని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న ఆసుపత్రుల విషయంలో అనవసర విమర్శలు తగవని అన్నారు. కొరుట్ల నియోజకవర్గ ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని పేర్కొంటూ, వీకెండ్ ఎమ్మెల్యేకు జువ్వాడి కృష్ణారావు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు ఆసుపత్రి డాక్టర్ సూపరింటెండెంట్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి బలపరిచిన అభ్యర్థి సత్యం శ్రీ దుర్గను గెలిపించండి: మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణ



స్థానిక మండలంలోని ఇనుగంటివారిపేట ఎంపీటీసీగా బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి సత్యం శ్రీ దుర్గను కమలం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని బిజెపి మండల ఉపాధ్యక్షుడు సత్యం రామకృష్ణ కోరారు. ఇనుగంటివారిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థి శ్రీ దుర్గతో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తమకు బి-ఫామ్ లభించిందని, గ్రామ అభివృద్ధికి శ్రమిస్తామని తెలిపారు. అయితే, నామినేషన్ల ఉపసంహరణ సమయంలో స్థానిక జనసేన, కూటమి నాయకులు తమను బెదిరించి ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తీసుకురావడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నాయకులు బిజెపిపై చిన్నచూపు చూస్తున్నారని, ఈ విషయాన్ని రాష్ట్ర అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రజల మద్దతు తమకే ఉందన్న ఆయన, గ్రామాభివృద్ధి కోసం కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుగు శ్రీనివాస్, ఎస్సీ లీగల్ సెల్ కన్వీనర్ వీధి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాలో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక డ్రైవ్,

●జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





వేసవి కాలంలో ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో గ్రామీణ నీటి సరఫరా ఈ.ఈ. వెంకటేష్, మిషన్ భగీరథ ఈ.ఈ. మధుసూదన్ లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, డి.ఈ.లు, ఎ.ఈ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా త్రాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల పనితీరును మెరుగుపరచడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రిడ్, బల్క్ వాటర్ సప్లై పథకాల ద్వారా మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలకు శుద్ధి చేసిన నీరు సక్రమంగా చేరేలా పర్యవేక్షించాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మండల స్థాయి సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీ కార్యాచరణ ప్రకారం మండల స్థాయి బృందాలు అన్ని ఆవాసాలను సందర్శించి త్రాగునీటి సరఫరా పరిస్థితి, పైప్‌లైన్లలో లీకేజీలు, వాల్వ్‌ల పనితీరు, నీటి సరఫరా వ్యవస్థలోని లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, మ్యాన్‌హోల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు, నీటి ట్యాంకులకు క్లోరినేషన్ నిర్వహించాలని, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్ వినియోగించి త్రాగునీటి నాణ్యతను నిర్ధారించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాలలో ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు 1916 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌ను సమర్థవంతంగా అమలు చేసి, రానున్న వేసవి కాలంలో ప్రజలందరికీ సురక్షితమైన, నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న వెంకన్నకు బంగారు హారం, వెండి కానుకలు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి గుంటూరు వాస్తవ్యులు వెలగలేటి సత్యవతి బంగారు, వెండి కానుకలు సమర్పించారు. కీ.శే. వెలగలేటి దుర్గాదేవి జ్ఞాపకార్థం భక్తిశ్రద్ధలతో ఈ కానుకలను మంగళవారం అందజేశారు. 72 గ్రాముల బంగారంతో తయారు చేసిన లక్ష్మీదేవి బొమ్మలు, ముత్యాలు, ఎరుపు, తెలుపు, పచ్చరాళ్లతో కూడిన 2 స్టెప్స్ మెట్ల హారం, 340 గ్రాముల అష్టలక్ష్మీల నగిషీతో కూడిన వెండి చెంబు.స్వామివారి సన్నిధిలో ఆలయ ఈవో త్రినాథరావుకి శాస్త్రోక్తంగా కానుకలను అందజేశారు. దాతను ప్రత్యేకంగా అభినందించి వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి ప్రసాదాలు అందజేసి రశీదును అందించారు.

చంద్రబాబు దార్శనికతకు ప్రతీక ఎన్నికల ఫలితాలు..!





●భారీ మెజారిటీలో రాష్ట్ర ప్రథమ స్థాయి రికార్డు సాధించిన సుష్మారెడ్డి..!

●100 శాతం స్ట్రైక్ రేట్ తో కౌన్సిలర్ అభ్యర్థుల విజయం..!

●విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే జూలకంటి

చంద్రబాబు కష్టానికి, దార్శనికతకు ప్రతీక స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం మాచర్ల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి సాధించిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో అఖండ మెజార్టీ సాధించి, రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిచిన కూటమి చైర్మన్ అభ్యర్థి యెనుముల సుష్మాకేశవరెడ్డిని అభినందించి, డిక్లరేషన్ ఫామ్ ను అందజేశారు. భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.గత ఎన్నికల్లో అరాచకం రాజ్యమేలిందని, నేడు రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యం గెలిచిందని చెప్పారు. 36 వార్డుల నందు కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించారని .., ఇది ప్రజా విజయం అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు పరుగులు పెట్టాయని వివరించారు. కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న అపారమైన నమ్మకాన్ని ఎన్నికల ఫలితాలే తెలిపాయన్నారు. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇచ్చేలా స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయింపు విషయంలో టిడిపి రథసారథి, మంత్రి నారా లోకేష్ పాత్ర, మార్కు రాజకీయం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వందల కోట్లతో మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనులే.., కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు స్పష్టమైన ఆధిక్యాన్ని అందించిందని వెల్లడించారు. నాలుగు దశాబ్దాల మాచర్ల మున్సిపాలిటీ చరిత్రలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా 100% స్ట్రైక్ రేటుతో భారీ విజయం సాధించిన కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను, 23,337 ఓట్లతో అఖండ మెజారిటీ సాధించిన చైర్పర్సన్ యెనుముల సుష్మా కేశవరెడ్డిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఓట్లేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కష్టించి, అభ్యర్థుల గెలుపుకు దోహదం చేసిన కూటమి పార్టీల శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ

నిజాలను వెలికితీసే విలేకరులే ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం.

-జర్నలిస్ట్ లపై దాడులు చట్టాలు కఠినంగా అమలు కావాలి.

-సినీయర్ జర్నలిస్టులు సేవలు అభినందనీయం.

- విశ్వాసనీయ వార్తలులే అందించాలి.

-నిజాలు వ్రాసే విలేకరులకు అండగా, రక్షణ కల్పిద్దాం.

సమాజంలో నిజాలను నిర్భయంగా వెలికితీసే విలేకరులే ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అని సినీయర్ జర్నలిస్ట్ లు , ఆ సంఘం ఎపిటిఎఫ్ నాయకులు అన్నారు. సోమవారం జర్నలిస్టులపై దాడులు దినోత్సవం సందర్భంగా సినీయర్ జర్నలిస్ట్ లు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బయట పెట్టేందుకు ప్రాణాలకు తెగించి పనిచేసే జర్నలిస్టులకు రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యతని వారు ఆకాంక్షించారు.ఈక్రమంలోనే జర్నలిస్ట్ లు రక్షణకు కమిటీ వేసి చర్యలు తీసుకోవడం హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో చట్టాలు కఠినంగా అమలు కావాలిని అన్నారు: విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై జరుగుతున్న బెదిరింపులు, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జర్నలిస్ట్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఈ ప్రాంతంలో సీనియర్ జర్నలిస్టులు సేవలు అభినందనీయం: మారుమూల గ్రామాల్లో సైతం నిజాలను ప్రజల ముందుకు తీసుకు రావడంలో మీడియా వంటి స్థానిక పత్రికల పాత్ర కీలకమని ప్రముఖులు కొనియాడారు.

ఫేక్ న్యూస్ కు చెక్ పెట్టి, విశ్వసనీయ వార్తలే అందించాలి: సోషల్ మీడియా యుగంలో తప్పుడు వార్తలను నమ్మకుండా, నిర్ధారిత సమాచారాన్ని మాత్రమే ప్రజలకు అందించడంలో బాధ్యతాయుత జర్నలిజం అవసరం ఎంతైనా ఉంది.

ఈ దినోత్సవం సందర్భంగా నిజాల కోసం పోరాడే ప్రతి జర్నలిస్ట్ కు అండగా నిలుద్దాం, వారికి రక్షణ కల్పిద్దాం అని వారు పిలుపునిచ్చారు. నిర్భయంగా వార్తలు వ్రాసే విలేకరులకు పలువురు పౌరులు , నాయకులు ఈ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో విలేకరులు పాల్గొన్నారు.

డీకేటీ భూముల ఫ్రీహోల్డ్‌పై కొత్త మార్గదర్శకాలు

●దరఖాస్తుల పరిష్కారానికి కాలపరిమితులు.. రిజిస్ట్రేషన్లకు వెసులుబాటు

●లక్కిరెడ్డిపల్లి మండల రైతుల్లో ఆశలు

రాష్ట్రంలో డీకేటీ (అసైన్డ్) భూముల ఫ్రీహోల్డ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న భూ సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితులు విధిస్తూ రెవెన్యూ శాఖ జీవో ఎంఎస్ నంబర్ 659ను నవంబర్ 2న విడుదల చేసింది. ఈ నిర్ణయంతో లక్కిరెడ్డిపల్లి మండలంలోని అర్హత కలిగిన డీకేటీ భూముల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

దరఖాస్తుల పరిష్కారానికి గడువులు

గత సెప్టెంబర్ 15న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 588కు సవరణలు చేస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు ఇచ్చింది. నిర్దిష్ట కేటగిరీలకు చెందిన ఫ్రీహోల్డ్ దరఖాస్తులను ఆర్డీవోలు 60 రోజుల్లోగా, మరికొన్ని కేటగిరీల దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రోజే సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా వ్యవస్థను రూపొందించాలని స్పష్టం చేసింది.

వెబ్‌ల్యాండ్‌లో నమోదు అయితే రిజిస్ట్రేషన్‌కు అవకాశం

చట్టబద్ధంగా ఫ్రీహోల్డ్ హోదా పొందిన భూములను వెబ్‌ల్యాండ్‌లో 'మేడ్ ఫ్రీహోల్డ్'గా నమోదు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపు ఉత్తర్వులు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాల ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన మార్పులు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించింది.

రైతులు ఏం చేయాలి?

లక్కిరెడ్డిపల్లి మండలంలో డీకేటీ పట్టాలు కలిగిన రైతులు తమ భూములకు సంబంధించిన అసైన్‌మెంట్ పట్టాలు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, అడంగల్, వెబ్‌ల్యాండ్ వివరాలను పరిశీలించుకోవాలి. ఫ్రీహోల్డ్‌కు అర్హత ఉందో లేదో సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా నిర్ధారించుకోవాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు వాటి ప్రస్తుత స్థితిని తెలుసుకోవాలి.

అయితే ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు అన్ని డీకేటీ భూములకు వర్తించదు. చట్ట నిబంధనల ప్రకారం అర్హత ఉన్న భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కులు వర్తిస్తాయి. దీంతో మండలంలో అర్హులైన రైతులకు ఈ కొత్త మార్గదర్శకాలు ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయో వేచి చూడాలి.

పశ్చిమగోదావరి జిల్లాని ముంచెత్తిన మురసు తుఫాన్!

కుండపోత వర్షంతో జలమయమైన లోతట్టు ప్రాంతాలు

రహదారులు, వరి పొలాలు నీట మునక ఉప్పొంగిన డ్రైనేజీలు



మురసు తుఫాన్ ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, గ్రామీణ రహదారులు, వ్యవసాయ భూములు వర్షపు నీటితో నిండిపోయాయి. భారీ వర్షాల కారణంగా డ్రైనేజీలు ఉప్పొంగి రహదారులపైకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల వరి పొలాలు నీట మునగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు తాజా వర్షాలు మరింత కష్టాలను తెచ్చిపెట్టాయి. వర్షపు నీరు ఇళ్ల పరిసరాల్లోకి చేరడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారులపైనే నిలిచిపోతోంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తూ, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ మెజారిటీతో నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి విజయం

●జనసేన బలపరిచిన కూటమి అభ్యర్థికి ఓటర్ల పట్టం

●గెలుపుతో కూటమి శ్రేణుల్లో వెల్లివిరిసిన సంబరాలు

నరసాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జనసేన బలపరిచిన కూటమి అభ్యర్థి కొత్తపల్లి శైలజ ప్రత్యర్థి కావాలి రామ సీతపై 17069 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఎన్నికల బరిలో ఆమెకు మద్దతుగా నిలిచిన కూటమి శ్రేణుల ఆశలు ఫలించగా, ఓటర్లు తమ ఓటు హక్కుతో ఆమెకు



విజయాన్ని అందించారు. ఎన్నికల ప్రచార సమయంలో కూటమి నేతలు, కార్యకర్తలు చేసిన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పోలింగ్‌లో ఓటర్లు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో భారీ మెజారిటీతో విజయం సాధించారు. కూటమి శ్రేణుల్లో ఉత్సాహం తమ అభ్యర్థి ఘన విజయం సాధించడంతో జనసేనతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం కూటమి ఐక్యతకు, ప్రజల మద్దతుకు నిదర్శనమని శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

కురవి మండలంలో ఆర్టీఏ కొరడా.. బడి పిల్లల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు!

•ఓవర్‌లోడ్ ఆటోలు సీజ్.. సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు

కురవి/ మహబూబాబాద్, జిల్లా నవంబర్ 3 2026

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా బడి పిల్లలను తరలించే ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలు, పాఠశాల బస్సులపై రవాణా శాఖ అధికారులు వరుసగా రెండో రోజు తనిఖీలు కొనసాగిస్తున్నారు. కురవి మండల కేంద్రంలో వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలు సీజ్

విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకొని వెళు ్న్న ఆటోలతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆర్‌సీ, ఎఫ్‌సీ, పర్మిట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అవసరమైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా వాహన యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు.

తల్లిదండ్రులకు విజ్ఞప్తి



తల్లిదండ్రులు తమ పిల్లలను ఓవర్‌లోడ్ ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాల్లో పాఠశాలలకు పంపించవద్దు. వాహనంలో పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తున్నారా? డ్రైవర్‌కు సరైన డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? వాహనానికి అవసరమైన పత్రాలు ఉన్నాయా? అనే విషయాలను పరిశీలించాలి. పిల్లలను సురక్షితంగా పాఠశాలకు పంపించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత.

పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలి

పాఠశాలలకు విద్యార్థులను తీసుకువచ్చే ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలు, ఇతర రవాణా వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలు ఉన్నాయో లేదో యాజమాన్యాలు తప్పనిసరిగా తనిఖీ చేయాలి. డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉందో లేదో నిర్ధారించుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలకే విద్యార్థులను తరలించే బాధ్యత అప్పగించాలి. విద్యార్థుల భద్రతను విస్మరించవద్దని సూచిస్తున్నారు.

వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం

వర్షాల సమయంలో కరకట్టలు, చెరువు కట్టలు, బురద రహదారులు, జారుడు మార్గాల్లో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షం కారణంగా టైర్లు జారిపోయే ప్రమాదం ఉంది. వాహనం అదుపు తప్పడం, బ్రేకులు సరిగా పనిచేయకపోవడం వంటి పరిస్థితులు ఎదురుకావచ్చు. ముఖ్యంగా బడి పిల్లలను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు వేగాన్ని తగ్గించి, రహదారి పరిస్థితులను గమనిస్తూ ప్రయాణించాలి.

ఈ ప్రత్యేక తనిఖీల కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు ఎస్. వెంకట్ రెడ్డి, ఖాసీం, సుందర్‌లాల్ పాల్గొని వాహనాలను తనిఖీ చేస్తూ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా రవాణా నిబంధనలు పాటించాలని, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు, వాహన యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమం.

పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నమోదు చేయించే కార్యక్రమాన్ని పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు గోడిశాల రామనాధం, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు తోలెం కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.మండల పరిధిలోని తోగ్గూడెం, పినపాక తదితర ఏజెన్సీ గ్రామీణ పంచాయతీలలో కాంగ్రెస్ నాయకులు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులను సమాయత్తం చేస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. అర్హత కలిగిన విద్యావంతులను, యువతను అభినందిస్తూ ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించి దరఖాస్తులు చేయించేందుకు కృషి చేశారు. అలాగే మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపక బృందాలతో సంభాషణలు జరిపారు.



- సర్వోత్తమ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి :పేరం వెంకటేశ్వర్లు.

కాంగ్రెస్ పార్టీ అధికారికంగా బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి ప్రజాసేవకుడని వారి విజయ సాధనకై ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు కోరారు. పోరాట పటిమ కలిగిన వ్యక్తిని శాసనమండలికి పంపడం ద్వారా విద్యావంతుల గొంతుకను చట్టసభలలో వినబడేలా చేయవచ్చని ఆకాంక్షించారు. సర్వోత్తమ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయాన్ని చేకూర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పట్టభద్రుడిపై ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా దిశ కమిటీ సభ్యులు మద్దెల సమ్మయ్య, స్థానిక సర్పంచ్‌లు పూనెం వెంకటేశ్వర్లు, అరిగెల అలివేలు, మట్టా బాబురావు, వాగబోయిన చంద్రరావు, ఉపసర్పంచ్‌లు అచ్చా నవీన్, కొడం రామ్మోహన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిట్టిమల్ల ప్రసాద్, ఆత్మ కమిటీ ప్రతినిధి చిట్టిమల్ల సతీష్ , వార్డు సభ్యులు జాన్ బాబు, కోరం భూషణం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వతంత్ర రెడ్డి, డొంకెన సాంబశివరావు, కొంపెల్లి మల్లేష్, బండారు గిరి ప్రసాద్, పాయం రామయ్య, కొమరం నగేష్, శ్రీను, సల్లూరి లక్ష్మయ్య, అనిపెద్ది వినోద్, రేగళ్ల జగన్, అనిల్, కృష్ణ, రాజేష్, నవీన్,లతో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు

యువత అన్ని రంగాలలో రాణించాలి,

•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,





యువత అన్ని రంగాలలో ముందుండాలని, దేశ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, వీధి నాటకాలు, చిత్రలేఖనం, కవితా పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని, ఇలాంటి పోటీలు యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆయా విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు యువజనోత్సవాలు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. యువతీ యువకులు జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటున్న విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. యువత తమలోని నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సామాజిక సేవా కార్యక్రమాలలో విశేషంగా సేవలందించిన యువజన సంఘాల ప్రతినిధులను సన్మానించారు. అనంతరం వివిధ కేటగిరీలలో పోటీలలో పాల్గొని మొదటి మూడు స్థానాలలో నిలిచిన విజేతలకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి హనుమంత రెడ్డి, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి రవికృష్ణ, సంబంధిత అధికారులు, యువతీ, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేట్ లకు వి బి జీ రామ్ జీ చట్టంపై శిక్షణ కార్యక్రమం, బాధ్యతలు, పనుల నిర్వహణపై అవగాహన కల్పించిన ఎంపీడీవో డి. వీణ,

భీమారం మండలానికి చెందిన 20 మంది మేట్ లకు వి బి జీ రామ్ జీ, చట్టంపై మంగళవారం రోజున భీమారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా భీమారం మండల ఎంపీడీవో డి. వీణ, మాట్లాడుతూ వి బి జీ రామ్ జీ, చట్టంలోని ప్రధాన అంశాలు, మేట్ ల బాధ్యతలు, విధులపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు, ముఖ్యంగా మేట్ లు నిర్వహించాల్సిన విధులు, గ్రామాల్లో చేపట్టవలసిన పనులు, ఎల్ నినో, ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన పనులు, కూలీలకు నోటిఫైడ్ వేతన రేటు ఏ విధంగా అందుతుందనే అంశాలను వివరించారు, ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, పాల్గొన్నారు





యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే పంటలు సాగు చేయాలి

సాగుభూమి, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'కేత్ బచావో అభియాన్' (సాగుభూమి సంరక్షణ) కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జె. బాబు పాల్గొని సాగుభూమి, నీటి పరిరక్షణ విధానాలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం, పంటలపై దాని ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యాలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ, నువ్వులు, ఆముదం వంటి నూనెగింజల పంటలతో పాటు నీటి ఎద్దడిని తట్టుకునే జొన్న, సజ్జ పంటలు సాగు చేయాలని తెలిపారు. కొంత నీటి వసతి ఉన్న రైతులు కూరగాయల పంటలను ఎంచుకోవాలని సూచించారు.

క్షయ వ్యాధి నివారణలో ఆశా కార్యకర్తలదే కీలక పాత్ర : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్.

- గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానితులను గుర్తించాలి.

- బాధితులకు సకాలంలో పరీక్షలు, పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలి.

క్షయ వ్యాధి నిర్మూలనకు ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. మంగళవారం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సరైన సమయంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందేలా కృషి చేయాలని సూచించారు.క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి



వ్యాపించే అవకాశం ఉన్నందున ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. వారిని సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి కఫ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు అందేలా పర్యవేక్షించాలన్నారు. సాధారణ ప్రసవాల సమయంలో నవజాత శిశువులకు అందించాల్సిన వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా కార్యకర్తలకు వివరించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల వైద్య సేవలు అందించే కేంద్రం కావడంతో వైద్యాధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్‌తో పాటు జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి మోహన్, సామాజిక ఆరోగ్య అధికారి సత్యావతి, నేత్ర వైద్య అధికారి జి. సంజీవరావు, ప్రజారోగ్య నర్సు దేవమ్మ, సహాయక నర్సులు, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కూడా పాఠశాలలకు సెలవు



మురసు తుఫాన్ ప్రభావంతో పల్నాడు జిల్లా లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నేడు అనగా 4.11.2026 బుధవారం కూడా సెలవు ప్రకటించడమైనది. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు పరిహార సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని డిప్యూటీ డిఈవోలు, ఎంఈఓ లు, ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

ఎన్నికల విధుల సన్నాహాలు వేగవంతం



స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. మొన్న 167 మంది, నిన్న 9 మంది కలిపి మొత్తం 176 మంది సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ఎ ్ ా క ్ ు న ా వినియోగించుకున్నారని రిటర్నింగ్ ఆఫీసర్ సీహెచ్ శిరీష తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ స్కూల్‌లో కౌంటింగ్ సిబ్బందికి, ఎంపీడీవో కార్యాలయంలో జోనల్, రూట్ మరియు డిస్ట్రిబ్యూషన్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, బుధవారం పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

తుఫాన్ నేపథ్యంలో ఉచిత బియ్యం పంపిణీ

•కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాలకు 25 కేజీలు

•మిగిలిన గ్రామాలకు 10 కేజీలు

•మొగల్తూరు మండల ప్రజలకు ఎమ్మార్వో ఫరూక్ విజ్ఞప్తి

తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అండగా నిలిచేందుకు ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. మొగల్తూరు మండల పరిధిలోని కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల ప్రజలకు ఒక్కొక్క రేషన్ కార్డు పై 25 కేజీల బియ్యం పంపిణీ చేయనున్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల ప్రజలకు ఒక్కొక్క రేషన్ కార్డు పై 10 కేజీల చొప్పున ఉచిత బియ్యం అందించనున్నారు. ప్రతినెల సరఫరా చేసే రేషన్



బియ్యం తో పాటు అదనంగా వీటిని అందించనున్నారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) ఫరూక్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా అధికారుల సూచనలు పాటించాలని, పంపిణీ కార్యక్రమానికి సహకరించాలని ఆయన కోరారు.

‘రామాయణ’కి పైరసీ ముప్పు.. కీలక ఆదేశాలిచ్చిన బాంబే హైకోర్టు



నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం ‘రామాయణ’ . నవంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి పైరసీ ముప్పు లేకుండా బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పైరసీ నుంచి రక్షణ కల్పించాలంటూ గాడ్‌పవర్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. సినిమాను రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, స్ట్రీమింగ్ చేయడంపై నిషేధం విధించింది. అనధికారిక లింకులు, మిర్రర్ వెబ్‌సైట్లను గుర్తించి తొలగించాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, సామాజిక మాధ్యమ సంస్థలను కోర్టు ఆదేశించింది. పైరసీ కంటెంట్‌కు సంబంధించిన సమాచారం అందిన వెంటనే వాటిని బ్లాక్ చేయడం, తొలగించడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ మాధవ్ జమ్దార్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ‘రామాయణ’ తొలి భాగాన్ని రూ.2 వేల కోట్ల వ్యయంతో నిర్మించినట్లు విచారణ సందర్భంగా మేకర్స్ కోర్టుకు వెల్లడించారు. ఈ చిత్రం రెండు భాగాలకు కలిపి రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు వెల్లడించారు. ప్రివ్యూ ప్రదర్శనల్లోనూ కఠినమైన ఒప్పందాలు అమలు చేసినప్పటికీ.. రెండు ట్రైలర్లను కొందరు రహస్యంగా రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇలాగే, మళ్లీ పైరసీ చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 16న జరగనుంది.

గన్ పౌడర్ సువాసనలో వికసించిన గులాబీలు



‘నా లక్ష్యం నా ప్రియురాలే..’ అని ప్రపంచానికి చెబుతూ రొమాంటిక్ గీతంతో ప్రేయసితో కలిసి సముద్ర తీరాన పాటలు పాడుకుంటున్నారు బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్. ఆయన.. కథానాయిక దీపికా పదుకొణె జంటగా ‘కింగ్’ చిత్రం తెరకెక్కుతోంది. సోమవారం షారుక్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి ‘తూ మిల్ జాయే’ గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. ‘ఈ ప్రేమ యుగం కేవలం అదృష్టవంతుల కోసమే.. ఇక్కడ గన్ పౌడర్ సువాసనలో గులాబీలు వికసిస్తాయి’ అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో ఈ పాటని విడుదల చేసింది. ‘ఒకవేళ నువ్వు నాకు దొరికితే.. నా మనసుకి శాంతి.. నా ప్రాణాన్ని నీకు ఇస్తాను.. నీవల్ల అయితే హృదయమనే నదిని దాటు’ అంటూ హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీతో సాగుతోంది ఈ పాట. అర్జిత్ సింగ్, మధుబంటి బాగ్చి, ఎడ్ షీరన్ ఆలపించిన ఈ గీతాన్ని సచిన్- జిగర్ స్వరపరిచారు. కుమార్ సాహిత్యం అందించారు. గౌరీ ఖాన్, మమతా ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకుడు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 24న థియేటర్లలో విడుదల కానుంది.

ప్రతి అమ్మాయికీ కనెక్ట్ అయ్యే.. అ



“థియేటర్లో కూర్చున్న ప్రేక్షకులకు ఎక్కడా ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టించకుండా సాగే సినిమా ‘అ” అన్నారు హీరో రాహుల్ విజయ్. ఆయన.. అర్చనా అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని సాయి బాలి తెరకెక్కించారు. కనకరావు తొనంగి, అభిషేక్ కే, గ్యారీ బీహెచ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. దర్శకురాలు నందినీ రెడ్డి, నిర్మాత వంశీ నందిపాటి, హీరో ఆకాశ్ పూరి, కథానాయికలు శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. “ప్రతి అమ్మాయికీ కనెక్ట్ అయ్యే కథ ఇది” అన్నారు నటి అర్చనా అయ్యర్. రాహుల్ విజయ్ మాట్లాడుతూ.. “ఇది డార్క్ క్రైమ్ జానర్‌లో సాగే సినిమా. కథంతా అర్చన పాత్ర చుట్టూనే తిరుగుతుంది” అన్నారు.

ఓ మాతా రే.. మైసా రే



ఈ దసరాకి ‘రణబాలి’తో ప్రేక్షకుల్ని పలకరించారు నటి రష్మిక. ఇప్పుడీ నవంబరులో ‘మైసా’తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని రవీంద్ర పుల్లె తెరకెక్కించారు. అన్‌ఫార్ములా ఫిల్మ్ సంస్థ నిర్మించింది. ఈశ్వరీ రావు, రావు రమేశ్, గురు సోమసుందరం తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం “ఓ మాతా రే.. మైసా రే..” అంటూ సాగిన ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి సుద్దాల అశోక్ తేజ సాహిత్యమందించగా.. సింధూజ శ్రీనివాసన్ ఆలపించారు. బృందా మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. ఈ పాటలో రష్మిక కనిపించిన తీరు.. ఆమె వేసిన ఆవేశభరితమైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాలో తను శక్తిమంతమైన గిరిజన గోండు యువతిగా కనిపించనున్నారు.

డేర్ డెవిల్‌లో శ్రీలీల

వైవిధ్యమైన కథలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తూ... వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయిక శ్రీలీల. తాజాగా ఆమె ఖాతాలో మరో తమిళ ప్రాజెక్ట్ చేరింది. అగ్ర కథానాయకుడు అజిత్ కుమార్ ముఖ్య పాత్రధారిగా తెరకెక్కుతున్న ‘డేర్ డెవిల్’ సినిమాలో ఆమె కథానాయికగా నటించనున్నారు. ఎప్పట్నుంచో ప్రచారంలో ఉన్న ఈ చిత్రం ఎట్టకేలకు చిత్రీకరణ ప్రారంభించుకుంది. సోమవారం ఈ సినిమాని అధికారికంగా ప్రారంభించినట్లు చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’ హిట్ తర్వాత అజిత్.. దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌ల కలయికలో వస్తోన్న చిత్రమిది. ఇందులో ఉన్ని ముకుందన్, పార్థిబన్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని అజిత్ భార్య శాలిని అజిత్ కుమార్ బ్రేవ్‌హార్ట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా: సూర్య



సూర్య కథానాయకుడిగా జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ కామెడీ చిత్రం ‘సీన్’ . నజ్రియా కథానాయికగా నటిస్తున్నారు. నస్లేన్ కీలక పాత్ర పోషించారు. ఈ మూవీ దీపావళి కానుకగా నవంబరు 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ సోమవారం రాత్రి ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్య మాట్లాడుతూ.. “ ‘సీన్’ నాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఈ ఏడాది నా నుంచి వస్తున్న మూడో చిత్రమిది. జీతూ గత చిత్రాలు ‘రోమాంచకం’, ‘ఆవేశం’లాగే ఇది కూడా అద్భుతంగా ఉంటుంది ” అని అన్నారు

టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు... యువతి అరెస్ట్



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటన కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు హరియాణాలోని కర్నాల్‌కు చెందిన 22 ఏళ్ల యువతిని అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరింది అరెస్టయిన యువతిని సుభేహా పండిట్‌గా గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన రాధ, బబిత తర్వాత నిందితుల జాబితాలో చేరిన మూడో మహిళ ఈమె. గతంలో అరెస్టయిన ఇద్దరు మహిళలు నిందితులకు ఆయుధాలు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నేర కార్యకలాపాల్లో సుభేహా పండిట్ కూడా భాగస్వామిగా ఉన్నట్లు క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నవంబర్ 1న హరియాణా పోలీసుల సహకారంతో కర్నాల్‌లో ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ కేసులో మరిన్ని వివరాల కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఏం జరిగిందంటే?

అక్టోబర్ 18న జుహు ప్రాంతంలోని ఓ ఫుట్‌బాల్ మైదానం నుంచి కారులో వెళుతుండగా.. ముగ్గురు దుండగులు బైక్‌పై వచ్చి టైగర్ కారుపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నటుడికి స్వల్ప గాయాలు కాగా.. ఆయన డ్రైవర్, ఉమేశ్ అనే ఓ అభిమాని తీవ్రంగా గాయపడ్డారు. దుండగులు మరో బాలీవుడ్ స్టార్‌ను కూడా టార్గెట్ చేశారని.. అక్కడ భద్రత ఎక్కువగా ఉండటంతో ప్లాన్ మార్చి టైగర్‌పై కాల్పులకు పాల్పడ్డారని విచారణలో తేలింది.



అధిక ధరకు బియ్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు,

•సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాసంస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

•జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అధిక ధరలకు బియ్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణం మెయిన్ రోడ్డులో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు లోబడి బియ్యం విక్రయాలు జరిపేందుకు వీలుగా శ్రీనాథ్ ట్రేడర్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను ఇన్చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బి.పి.టి, హెచ్.ఎం.టి. తదితర రకాల బియ్యంను ప్రభుత్వ నిర్దేశిత ధరలకు అందించేందుకు గజానన్ ఇండస్ట్రీస్ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. రా రైస్ బ్యాగ్ ను 1430 రూపాయలు, హెచ్.ఎం.టి స్టీమ్ రకం బియ్యం బస్తా 1898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని చున్నంబట్టివాడ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. నిర్ణీత మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాలను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఎంపిసి విద్యార్థులకు గణిత బోధన జరుగుతున్న తీరును పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు మంజూరైన పడకలు, పరుపులను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.
అనంతరం చెన్నూర్ మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకం క్రింద చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించి, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరుకావాలని, విద్యార్థుల హాజరు శాతం, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వంటశాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థినులకు మంజూరైన పడకలు, పరుపులను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రమణమ్మ కుటుంబానికి అండగా నిలిచిన పాపిశెట్టి రామ్



ఆమనగల్ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన (రమణమ్మ). నిన్న రాత్రి. శివైక్యం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రామ్ వెంటనే శెట్టిపల్లి గ్రామానికి వెళ్లి రమణమ్మ.కుటుంబ సభ్యులను పరామర్శించారు..
ఈ సందర్భంగా రమణమ్మ. భర్తను ఓదార్చి, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతేకాకుండా వారి కుటుంబానికి అండగా నిలుస్తూ.. తన వంతు ఆర్థిక సహాయాన్ని రమణమ్మ గారి భర్తకు అందజేశారు. కష్టసమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి తన మానవత్వాన్ని చాటుకున్నారు... ఈ కార్యక్రమంలో రామ్ మిత్ర మండలి సభ్యులు. నూతన గంటి భాస్కర్. శ్రీను నాయక్. రమేష్. బుజ్జంగం. మరియు గ్రామ పెద్దలు.. వెంకటేష్. జంగయ్య. మల్లేష్. కుమార్. రాములు.కేసయ్య. రమేష్. సాయిలయ్య. మహేష్. చిన్న. యాదయ్య. తదితరులు పాల్గొన్నారు

జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేతకు జేఏసీ మద్దతు





•అఖిలపక్ష కార్యాచరణకు స్వాగతం..

శాశ్వత పరిష్కారమే లక్ష్యం

జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం అఖిలపక్షం ప్రకటించిన కార్యాచరణ ప్రణాళికను జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) స్వాగతిస్తున్నట్లు కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ తెలిపారు.నాగారంలోని ఎంవైఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ప్రకటించిన కార్యాచరణపై వారు స్పందించారు. వారం రోజుల తర్వాత జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. 109 రోజుల కార్యాచరణను 30 రోజుల్లోనే ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.గత 27 ఏళ్లుగా పరిష్కారం కాని డంపింగ్ యార్డు సమస్యపై అధికార పార్టీ చొరవ తీసుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందుల కోణంలో చూడాలని కోరారు. ఈ సందర్భంగా 12 డిమాండ్లతో కూడిన తమ వైఖరి పత్రాన్ని అఖిలపక్షానికి అందజేసినట్లు తెలిపారు. డంపింగ్ యార్డును ఆధునీకరణ పేరుతో అక్కడే కొనసాగించకుండా శాశ్వతంగా ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించి, సంబంధిత జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్షల టన్నుల పాత చెత్తను 12 నెలల్లో బయోమైనింగ్ ద్వారా తొలగించి, ఆ ప్రాంతాన్ని బయోడైవర్సిటీ పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు.అలాగే డంపింగ్ యార్డు పరిసర 15 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు, రూ.20 లక్షల ఉచిత ఆరోగ్య బీమా, బాధితులకు ఆస్తి పన్ను మినహాయింపు, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలు, మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 3,000 మంది వేస్ట్ వారియర్స్‌కు జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేదా రూ.50 లక్షల పరిహార ప్యాకేజీ అందించాలని కోరినట్లు వెల్లడించారు.
అఖిలపక్షం ప్రకటించిన 109 రోజుల కార్యాచరణ కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా డంపింగ్ యార్డు శాశ్వత ఎత్తివేతకు దోహదపడాలని జేఏసీ నాయకులు ఆకాంక్షించారు. ఈ పోరాటానికి తమ కమిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.
అఖిలపక్షం ప్రకటించిన వారం రోజుల గడువులోగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజల భాగస్వామ్యంతో శాశ్వత అఖిలపక్ష సాధన కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతి నెలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించి డంపింగ్ యార్డు ఎత్తివేతకు ప్రభుత్వం వేగవంతమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు.
ఈ సమావేశానికి జేఏసీ కో-కన్వీనర్లు టీఆర్ఎస్‌కు చెందిన మేక లలిత యాదవ్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ గద్దం సదానందం, సీపీఐ దర్శనం యాదగిరి, సీపీఎం శివన్నారాయణ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహ్మద్ పాషామియా, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, టీయూసీఐ వి.ప్రవీణ్, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, ఏఐటీయూసీ అంబాల ఎల్లయ్య, సీఐటీయూ నర్సింహులు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే, భూ భారతి పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి,

•రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్,



భూముల రీ సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో విజిలెన్స్ కేసుల పురోగతి, భూదాన్ భూములు, భూముల రీ-సర్వే పురోగతి, హైకోర్టు కేసులు, భూ భారతి పథకంలో పాత, కొత్త పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూసేకరణకు సంబంధించిన అంశాలు, యూ ఎల్ సి భూములు, జీఓ నం.59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పురోగతి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్, మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదిక, భూముల రీసర్వే ప్రక్రియ పురోగతి, న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. యు ఎల్ సి భూములు, జి.ఓ. 59, 76, 118 క్రింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి సంబంధిత దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతి వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.
జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, భూభారతి పెండింగ్ దరఖాస్తులు నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. జి.ఓ. 59, 76, 118 క్రింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి బొండాల మాటున 8 పశువుల అక్రమ రవాణా!





•నంబర్ ప్లేట్ లేని టాటా ట్రాలీలో అమానుషంగా తరలింపు.. మరిపెడ పోలీసుల తనిఖీల్లో వెలుగులోకి అక్రమ దందా

•ముగ్గురు నిందితులపై కేసు నమోదు.. వాహనం సీజ్ -- పశువులకు వైద్య చికిత్స అందించి రక్షణ

మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 3:
కొబ్బరి బొండాల మాటున పశువులను దాచిపెట్టి అక్రమంగా తరలిస్తున్న వ్యవహారం మరిపెడ పోలీసుల రాత్రి గస్తీలో వెలుగులోకి వచ్చింది. నంబర్ ప్లేట్ లేకుండా కొబ్బరి బొండాలతో వెళ్తున్న అనుమానాస్పద టాటా ట్రాలీని పెట్రోలింగ్ సిబ్బంది ఆపి తనిఖీ చేయగా, అందులో ఎనిమిది పశువులను అమానుషంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.మరిపెడ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు నరేష్, జి. శ్రీను రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన టాటా ట్రాలీని ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొబ్బరి బొండాల కింద కాళ్లు, మెడలకు తాళ్లతో కట్టివేసి కదలలేని స్థితిలో ఉంచిన ఆరు ఆవులు, రెండు కోడెగిత్తలు కలిపి మొత్తం ఎనిమిది పశువులను గుర్తించారు.పోలీసుల విచారణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లికి చెందిన గొర్ల శివ, యలమచిలీ శివ, బంగారి లచ్చన్న ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. అనకాపల్లి ప్రాంతం నుంచి పశువులను సేకరించి, కొబ్బరి బొండాల మాటున హైదరాబాద్‌లోని కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు.

గాయపడిన పశువులకు చికిత్స

పోలీసులు పశువులను రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. పశువైద్యుల ద్వారా అవసరమైన వైద్య చికిత్స అందించారు. గాయపడిన పశువులు ప్రస్తుతం కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ సీజ్.. ముగ్గురిపై కేసు

పశువుల అక్రమ రవాణాకు ఉపయోగించిన టాటా ట్రాలీని పోలీసులు సీజ్ చేశారు. ముగ్గురు నిందితులపై పశువుల అక్రమ రవాణా, జంతువుల పట్ల క్రూరత్వానికి సంబంధించిన చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పశువుల అక్రమ రవాణాకు, జంతువుల పట్ల క్రూరత్వానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మరిపెడ ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలి,

•జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి, విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలు, సివిల్ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు, తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది, తాగునీటి సదుపాయాలు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, ఇతర సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. విద్యార్థుల వసతి గృహాలు, వంటగదిని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. నీటిని వృథాను అరికట్టాలని, ప్రతి నీటి బొట్టును బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. నీటి వృథాకు కారణమవుతున్న లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల వివరాల నమోదు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, ఎఫ్ ఆర్ ఎస్ వివరాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధాన భవనం వెలుపల లైటింగ్ సదుపాయం సరిగా లేని విషయాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యూ ఐ డి సి ఎఈ బషీర్, పాఠశాల ఉపాధ్యాయులు, చేసుకొని ఎన్నికల్లో బాధ్యతగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తిక్ కుమార్ గారిని కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన బీఎల్వో ఫారమ్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మట్టా విష్ణుగౌడ్, కుశా కుమార్, శశికుమార్, తానాషే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలి



కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మట్టా మదన్ కుమార్ గౌడ్.పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మట్టా మదన్ కుమార్ గౌడ్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు

మెప్మా అదనపు డైరెక్టర్ ఇంట్లో సోదాలు.. భారీగా ఆస్తుల గుర్తింపు



హైదరాబాద్: మెప్మా అదనపు డైరెక్టర్ యాదగిరిరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. అక్రమ మార్గాల్లో యాదగిరిరావు భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ అధికారులు తనిఖీల్లో గుర్తించారు. హైదరాబాద్, సూర్యాపేటలోని ఇళ్లు, కార్యాలయాలు, బ్యాంకు లాకర్లతో పాటు 10 ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు రూ.4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. హైదరాబాద్, సూర్యాపేటలో 12 స్థలాలు, ఉప్పల్‌లో 2 ఫ్లాట్లు, రూ.2కోట్ల విలువైన మూడంతస్తుల భవనం, ఓ దుకాణం, సూర్యాపేట జిల్లాలో మరో ఇల్లు, 1,792.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి నగలు, బ్యాంకు ఖాతాల్లో రూ.32.30లక్షల నగదు, 2 లగ్జరీ కార్లు, 3 బైక్‌లు ఉన్నట్టు తనిఖీల్లో తేలింది. యదగిరిరావు కుమారుడి పెట్టుబడులకు సంబంధించిన వివరాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



తెలంగాణ సమాజంలో చిచ్చుపెట్టే రాజకీయాలు మానుకోవాలి

చరిత్రలో రెడ్డిల త్యాగాలు తెలుసుకొని మాట్లాడాలి
రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి

యాదాద్రి భువనగిరి, నవంబరు03/ట్రైనెట్ న్యూస్: ఇటీవల కొన్ని రాజకీయ సమావేశాల్లో, ప్రెస్‌మీట్లలో, యూట్యూబ్ ఇంటర్వ్యూలలో రాజకీయ ప్రయోజనాల కోసం ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని మాట్లాడుతున్న తీరు తీవ్రంగా అభ్యంతరకరం.ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి చేస్తున్న అవమానకరమైన వ్యాఖ్యలు తెలంగాణ సమాజంలో అనవసరమైన కుల వైషమ్యాలను పెంచేలా ఉన్నాయి. రాజకీయంగా ఎవరినైనా విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. వ్యక్తుల తప్పులను ప్రశ్నించవచ్చు. నాయకుల విధానాలను ఎండగట్టవచ్చు. కానీ కొందరు వ్యక్తుల ప్రవర్తనను సాకుగా చూపించి మొత్తం ఒక సామాజిక వర్గాన్ని కించపరచడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ప్రజాస్వామ్యంలో విమర్శకు విలువ ఉంటుంది.కానీ కులాన్ని లక్ష్యంగా చేసుకొని చేసే అవమానానికి విలువ ఉండదు. బీసీ నాయకుడైనా, ఎస్సీ నాయకుడైనా, ఎస్టీ నాయకుడైనా, అగ్రవర్ణాలకు చెందిన నాయకుడైనా సమాజాన్ని కలిపే బాధ్యతతో మాట్లాడాలి. ఒక వర్గాన్ని తక్కువ చేసి మరో వర్గాన్ని రాజకీయంగా ఎదిగించాలనుకోవడం సంకుచిత రాజకీయమే అవుతుంది.అసలు తెలంగాణ గడ్డపై రెడ్డి సామాజిక వర్గం పాత్ర ఏమిటో విమర్శలు చేసే ముందు చరిత్రను ఒకసారి తిరగేయాలి.రెడ్డి సామాజిక వర్గం అంటే కేవలం భూస్వామ్యానికి, రాజకీయ అధికారానికి మాత్రమే ప్రతీక కాదు. తెలంగాణ సామాజిక, రాజకీయ, రైతాంగ, సాయుధ, ప్రజాస్వామ్య ఉద్యమాల్లో ఈ సామాజిక వర్గానికి చెందిన అనేకమంది నాయకులు కీలక పాత్ర పోషించారు. వారిలో కొందరు తమ ఆస్తులను, జీవితాలను ప్రజల కోసం త్యాగం చేశారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో రెడ్డి నాయకుల చరిత్రను తెలుసుకోండి:(1) రావి నారాయణరెడ్డి:తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అగ్రగామి నాయకుడు. నైజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. తన భూమిలో పెద్ద భాగాన్ని పేదలకు పంచి, రైతాంగ హక్కుల కోసం నిలబడ్డారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు.(2)బద్దం ఎల్లారెడ్డి: తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, పేద రైతులు, కూలీల హక్కుల కోసం పోరాడారు. తన సామాజిక నేపథ్యాన్ని పక్కనపెట్టి ప్రజా ఉద్యమాలకు అంకితమయ్యారు.(3)భీంరెడ్డి నరసింహారెడ్డి: నైజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. రైతాంగ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని ప్రజల హక్కుల కోసం పోరాడారు.(4) ఆరుట్ల రామచంద్రారెడ్డి -- ఆరుట్ల కమలాదేవి: ఈ దంపతులు తెలంగాణ సాయుధ పోరాటంలో చిరస్మరణీయమైన పాత్ర పోషించారు. ముఖ్యంగా కమలాదేవి మహిళలను సంఘటితం చేసి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని నింపారు. మహిళలు కూడా ఉద్యమాల్లో ముందుండి పోరాడగలరని నిరూపించారు.(5)మర్రి చెన్నారెడ్డి: 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షుడిగా ఉద్యమాన్ని రాజకీయంగా బలోపేతం చేసి, తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు.(6)మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎస్. వెంకటరామారెడ్డి వంటి నాయకులు: 1969 తెలంగాణ ఉద్యమ రాజకీయాల్లో పాల్గొన్న నాయకులుగా వారి పాత్రను కూడా తక్కువ చేసి చూడలేము.ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ రెడ్డి సామాజిక వర్గం భాగస్వామ్యం ఉంది. కొండా లక్ష్మణ్ బాపూజీతో వేలాది మంది రెడ్డి నాయకులు ఎందరో ఉన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో మర్రి చెన్నారెడ్డి వంటి నాయకులు తెలంగాణ ఆకాంక్షను దేశ రాజధాని దాక తీసుకెళ్లిండు. 2001 నుంచి ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ వేలాది మంది రెడ్డి యువకులు ఇతర కులాల యువతతో కలిసి రోడ్లపైకి వచ్చారు. అన్ని కుల సంఘాల వలె రెడ్డి కుల సంఘం కూడా తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక ర్యాలీలు చేయడమే కాకుండా తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో జరిగిన ఉద్యమాల్లో లాఠీ దెబ్బలు తిన్నారు. అరెస్టులను ఎదుర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ వంతు పాత్ర పోషించారు.మరి ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులు ఎందుకు కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు?రాజకీయంగా ప్రశ్నించడానికి సమస్యలు లేవా? పాలనలో వైఫల్యాలు లేవా? ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చించడానికి అంశాలు లేవా? నిరుద్యోగం, రైతుల సమస్యలు, బీసీల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యలను పక్కనపెట్టి కులాల పేరుతో రాజకీయాలు చేయడం దేనికి సంకేతం?బీసీ వర్గాల అభివృద్ధి కోసం పోరాడటం ఎంతో అవసరం. బీసీలకు రావాల్సిన హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం గట్టిగా మాట్లాడాలి. కానీ ఆ హక్కుల పోరాటాన్ని మరో సామాజిక వర్గంపై ద్వేషంగా మార్చకూడదు. బీసీల అభివృద్ధి రెడ్లను అవమానించడం ద్వారా జరగదు. అలాగే రెడ్ల అభివృద్ధి బీసీల హక్కులను అణచివేయడం ద్వారా జరగదు.రాజకీయ పార్టీ ముసుగులో రెడ్ల పై విషం చిమ్ముతున్న వారు ఒక కులాన్ని అవమానించి మరో కులానికి న్యాయం చేయలేరు. ఒక వర్గాన్ని శత్రువుగా చూపించి సమాజాన్ని అభివృద్ధి చేయలేరు.రెడ్డి సామాజిక వర్గంలోనూ పేదలు ఉన్నారు. వ్యవసాయ కార్మికులుగా బతుకుతున్నవారు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమవుతున్న కుటుంబాలు ఉన్నాయి. ప్రతి సామాజిక వర్గంలోనూ ధనికులు, పేదలు, రాజకీయంగా ఎదిగినవారు, వెనుకబడినవారు ఉంటారు. కాబట్టి ఒక వర్గాన్ని మొత్తం ఒకే గాటన కట్టడం సరైన ఆలోచన కాదు.కొంతమంది రాజకీయ పార్టీల ముసుగులో కులాన్ని టార్గెట్ చేస్తున్న వారికి ఒకటే విజ్ఞప్తి. మీకు రాజకీయ విమర్శలు చేయాలనిపిస్తే వ్యక్తులను విమర్శించండి. వారి విధానాలను విమర్శించండి. వారి అవినీతిని, వారి తప్పులను ఆధారాలతో ప్రశ్నించండి. కానీ కులం పేరుతో లక్షలాది మంది తెలంగాణ రెడ్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకండి.తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశయం కులాల మధ్య గొడవలు కాదు. తెలంగాణ పోరాట చరిత్రలో రెడ్ల పాత్రను చెరిపేయడం ఎవరి వల్లా కాదు. అదే సమయంలో ఇతర సామాజిక వర్గాల త్యాగాలను తక్కువ చేయడం కూడా మా ఉద్దేశం కాదు.తెలంగాణ అంటే ఒక్క కులం కాదు. తెలంగాణ అంటే సబ్బండ వర్గాల సమైక్యత. తెలంగాణ అంటే పరస్పర గౌరవం. తెలంగాణ అంటే ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు.రాజకీయ పదవుల కోసం కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. చరిత్ర తెలియక మాట్లాడేవారు చరిత్రను చదువుకోవాలి. తెలిసి కూడా కులాల పేరుతో విషం చిమ్మేవారు తమ రాజకీయ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి.ఒక్క మాటలో చెప్పాలంటే రెడ్లను తిట్టి బీసీలను ఉద్ధరించలేరు. బీసీలను తక్కువ చేసి రెడ్లను గౌరవించలేరు. అన్ని కులాలను గౌరవించినప్పుడే తెలంగాణ ఆత్మగౌరవం నిలబడుతుంది.

జై తెలంగాణ జై సబ్బండ వర్గాల ఐక్యత అంటున్న రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి.

రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై నిత్యావసరాలు!

బియ్యంతో పాటు ఇతర సరుకుల పంపిణీకి కార్యాచరణ

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:



నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు అందించే దిశగా పౌరసరఫరాల శాఖ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.కందిపప్పు, గోధుమపిండి, పంచదార, పామాయిల్, చింతపండు, కారంపొడి వంటి వస్తువులను పంపిణీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే అర్హులైన రేషన్ కార్డుదారులకు నెలవారీ సరుకుల ఖర్చులో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. అయితే సరుకుల ధరలు, పరిమాణం, అర్హతలు, పంపిణీ ప్రారంభ తేదీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

వేధింపులపై మౌనం వద్దు ధైర్యంగా ఫిర్యాదు చేయండి

ఆడపిల్లల భద్రతకు అండగా షీ టీమ్స్!

జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్

యాదాద్రి భువనగిరి, నవంబరు03/ట్రైనెట్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల భద్రత, మహిళా హక్కులు, ఈవ్ టీజింగ్, వేధింపులు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్స్ అందిస్తున్న సేవలు, ఫిర్యాదు చేసే విధానం, అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందే మార్గాల గురించి వివరించారు.





ణఖశ్రీ 112 ఉ శ్ఖవ్ ఖుఎం 8712665338 మహిళల భద్రతకు యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విద్యార్థినులు అప్రమత్తంగా ఉంటూ తమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

కాంగ్రెస్ సామాన్యుల ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం: మంత్రి సీతక్క

సర్వోత్తం రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చాం..
ఆశీర్వదించి గెలిపించండి -- మంత్రి సీతక్క

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:



కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డిని ఆశీర్వదించి మండలికి పంపాలని ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు, ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చదువు, సంస్కారం కలిగి, ప్రతి ఒక్కరినీ గౌరవించే వ్యక్తిత్వం ఉన్న సర్వోత్తం రెడ్డిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ఆయన ఎంతో నిరాడంబరంగా ఉంటారని, తండ్రి, పెద్దనాన్న మంత్రులుగా పనిచేసినా ఏనాడూ అధికారం చెలాయించలేదని అన్నారు. వారి కుటుంబం కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, అందుకే ఈసారి సర్వోత్తం రెడ్డికి పార్టీ అవకాశం కల్పించిందని వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. కారుణ్య నియామకాలు చేపట్టామని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రతి నెల మొదటి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. పెండింగ్ బకాయిలను నెలకు రూ.1,000 కోట్ల చొప్పున చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇప్పటికే రూ.4,500 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. కొత్త నిబంధనల పేరుతో ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలు, కళాశాలలను ఇబ్బందులకు గురిచేయడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఒక టీంగా పనిచేస్తూ ప్రతి హామీని అమలు చేస్తుందని అన్నారు.

గత ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేని 'అవుట్ ఆఫ్ కవరేజ్' ప్రభుత్వంగా ఉండేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ పాలన కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రతి గ్రామంలోనూ అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని అర్హులైన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారు వీలైనంత త్వరగా తమ ఓటును నమోదు చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్వోత్తం రెడ్డికి మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండే కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని, సర్వోత్తం రెడ్డిని ఆశీర్వదించి మండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో నిరంతర సంప్రదింపులు జరపాలి:

-సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 3:



తుమ్మిడిహట్టి బ్యారేజ్ పైన మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని వారికి సూచించారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని సీఎం స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టి పైన అధికారులతో సమీక్ష జరిపారు. మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపైన అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామన్నారు. భూముల ముంపుపైన మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు.

ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, ఇరిగేషన్ ఈఎన్‌సీ (జనరల్) రమేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతం చేయాలి:

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబర్ 03: డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న ప్రచార వ్యూహాలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపిన అంశాలపై ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.

హైదరాబాద్ నగరంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన



ప్రాంతాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయడంతో పాటు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యాన్ని పెంపొందించేలా 10ఖ రన్, క్రీడా పోటీలు, ఇతర ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు.

సమ్మిట్‌కు హాజరయ్యేందుకు ఆహ్వానాలు అందుకున్న ప్రతినిధులు, ప్రముఖులు, ఇతర ముఖ్య అతిథుల వివరాలను అధికారులు ప్రధాన కార్యదర్శికి వివరించారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రచార కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి, తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, అనుకూల పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమర్థవంతంగా చాటిచెప్పాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, డిజిటల్ మీడియా డైరెక్టర్ కర్రి శ్రీరామ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పెండింగ్ సమస్యల పరిష్కారం.. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 3:



ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంతోపాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం, క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.రెవెన్యూ, హౌసింగ్, భూ సర్వే శాఖలకు సంబంధించిన అంశాలకు క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి నమన్వయంతో చర్యలు తీసుకునే ఉద్దేశంతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నాడు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలోని షామీర్‌పేటలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇన్‌చార్జి మంత్రులు పాల్గొననున్నారు. రెవెన్యూ సమస్యలు, గృహ నిర్మాణ పథకాల అమలు, భూ సర్వే పురోగతితోపాటు ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్షించనున్నారు.గత ఏప్రిల్, మే నెలల్లో రాజధాని వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సమావేశాల్లో ఉమ్మడి జిల్లాల వారీగా శాఖల పనితీరు, సమస్యల పరిష్కారంపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. ఆయా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, క్షేత్రస్థాయిలో సాధించిన పురోగతి, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలపై ప్రస్తుత సమీక్షల్లో ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.సమీక్షల లక్ష్యం సమస్యలను గుర్తించడమే కాదు.. వాటికి పరిష్కారం చూపడం. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా, శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతమయ్యేలా ఈ సమావేశాలు దోహదపడతాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

డిల్లీలో భువనగిరి ఎంపీని ఆలేరు ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

యాదాద్రి భువనగిరి, నవంబరు03/ట్రైనెట్ న్యూస్: ఢిల్లీలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నివాసంలో ఎంపీని మరియు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని మర్యాద పూర్వకంగా కలిసిన భువనగిరి మరియు బీబీనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.




ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

12
బుధవారం నవంబర్ 04, 2026
www.trinetnews.com

ట్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...

తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం



“తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం” అనే సామెత సమాజంలో కృతఘ్నతను, నమ్మకద్రోహాన్ని ప్రతిబింబించే అద్భుతమైన సూక్తి. మనకు కష్టకాలంలో ఆశ్రయం ఇచ్చి, అన్నం పెట్టి ఆదరించిన వారికి కీడు చేసే దుర్మార్గుల గురించిన సామాజిక వాస్తవాన్ని ఈ వ్యాసం తెలియజేస్తుంది.

పూర్వకాలంలో ఇళ్లను కలప, దూలాలతో నిర్మించేవారు. ఎవరైనా ఆపదలో ఉన్నవారు ఆశ్రయం కోరి వచ్చినప్పుడు, పెద్దమనసుతో వారిని ఆదరించి ఆశ్రయం ఇచ్చేవారు. కానీ కొందరు దుర్మార్గులు ఆ ఇంట్లో సుష్టుగా భోంచేసి, విశ్రాంతిగా పడుకొని... ఆ ఇంటికి ఎన్ని దూలాలు ఉన్నాయి, వాటిని ఎలా కాజేయాలి? లేదా “నాలాంటి వాళ్ళు కష్టపడుతూ ఉంటే వీళ్ళు మాత్రం సుఖంగా ఉన్నారు, వీళ్ళని ఎలా పడగొట్టాలి?” అని ఆలోచిస్తూ ఉంటారు. దీనినే ‘తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం’ అంటారు.

నేటి ఆధునిక సమాజంలో ఇలాంటి ధోరణి మరీ ఎక్కువగా కనబడుతోంది. కొంతమంది ఒక వ్యాపారి దగ్గర నమ్మకంగా చేరి, పని నేర్చుకొని, అతని వ్యాపార రహస్యాలన్నీ తెలుసుకుంటారు. చివరికి ఆ యజమానికే నష్టం కలిగిస్తూ, తప్పుడు మార్గంలో సంపాదిస్తూ, ఆ సంపాదించిన దానితో సొంతంగా వ్యాపారం పెట్టుకుంటారు. ఇది ఒక రకమైన నమ్మకద్రోహం.

ఇక కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లల్ని పెంచి పెద్ద చేస్తారు. వారికి రెక్కలు ఇచ్చి, ఒక ఉన్నత స్థాయికి తీసుకొస్తారు. ఆఖరుకు వారి ఉద్యోగాల కోసం, చదువుల కోసం ఉన్న ఆస్తిని కూడా తెగనమ్మే తల్లిదండ్రులు ఎంతో మంది ఉన్నారు. అటువంటి కన్నవారిని వృద్ధాప్యంలో రోడ్డున పడేసే పిల్లలు ఈ రోజుల్లో ఎందరున్నారో మనకు తెలియదా? మనం నిత్యం చూస్తున్న చేదు నిజాలు అవే కదా!

రాజకీయాల విషయానికి వస్తే... ఒక పార్టీ ద్వారా సమాజంలో గుర్తింపు తెచ్చుకొని, పదవులను అనుభవించి, సమయం చూసి అదే పార్టీకి లేదా తమను పైకి తెచ్చిన నాయకుడికి వెన్నుపోటు పొడిచేవారు ఎందరో ఉన్నారు. వారు వేరే పార్టీకి మారటమో లేదా సొంతంగా వేరే పార్టీని ఏర్పాటు చేసుకోవడమో చేస్తుంటారు. ఈ ధోరణి ఈ కాలంలో ఒక సహజ ధోరణిగా మారిపోయింది.

నిజానికి శత్రువునైనా క్షమించవచ్చు కానీ, నమ్మకద్రోహం చేసిన విశ్వాసఘాతకులను ఆ దేవుడు కూడా క్షమించడు. వారి ఘాతకత్వం బయటపడిన నాడు సమాజం వారిని గౌరవించకపోగా చీదరించుకుంటుంది. ఆ ప్రభావం వారి మీద మాత్రమే కాదు, వారి కుటుంబంలో ఉన్న అమాయక వ్యక్తుల మీద కూడా పడుతుంది.

వీటన్నిటికీ కారణం స్వార్థం. “తమ స్వలాభం కోసం ఎవరినైనా మోసం చేయవచ్చు, నేను బాగుంటే చాలు పక్కవాడు నాశనమైనా పరవాలేదు” అనుకునే వ్యక్తులు ఒకరకమైతే... “నేను బాగున్నా, బాగోకున్నా పక్కవాడు మాత్రం బాగుండకూడదు” అనుకునే కుళ్ళు బుద్ధి గల వ్యక్తులు ఈ రోజుల్లో బాగా ఎక్కువయ్యారు. ఇలాంటి వారు కష్టాలు పడేటప్పుడు “మేం ఏం పాపం చేశాం?” అని ఏడుస్తారు. అప్పుడు వారికి తాము చేసిన ద్రోహాలు గుర్తుకు రావు. పాపాలంటే వేరే ఏవో కావు, మంచి చేసిన వారికి కీడు చేయడమే మహాపాపం. ఎప్పటికైనా ఆ పాపఫలితాన్ని అనుభవించక తప్పదు.

విశ్వాసం అనేది మానవ సంబంధాలకు పునాది వంటిది. జంతువులు కూడా తమకు అన్నం పెట్టిన యజమాని పట్ల ఎంతో కృతజ్ఞతతో, విశ్వాసంగా ఉంటాయి. కానీ బుద్ధి ఉండి, ఆలోచించగలిగే మనిషి మాత్రం స్వార్థంతో తనకు మంచి చేసిన వారికే ద్రోహం చేస్తాడు. ఇటువంటి వారి వలనే సమాజంలో ఒకరిపై ఒకరికి నమ్మకం పోతోంది. దీనివల్ల నిజంగా ఆపదలో ఉండి సహాయం కోరే వారికి కూడా సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేని దుస్థితి ఏర్పడుతోంది. కనుక ప్రతి ఒక్కరూ మానవత్వంతో మసలుకోవడం, విశ్వాసాన్ని కలిగి ఉండటం అలవర్చుకోవాలి. అప్పుడే సమాజం బాగుంటుంది, అందరూ బాగుంటారు.

శుభోదయం ... శశిబాల

అలరించిన ‘ఎవరో పాడారు భూపాలరాగం’

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

గోకులం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ‘బృందావనం’ సుబ్రహ్మణ్యం సమర్పణలో నిర్వహించిన ‘ఎవరో పాడారు భూపాలరాగం’ సంగీత కార్యక్రమం శ్రోతలను అలరించింది. మంగళవారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై గాయనీగాయకులు మధుర గీతాలను ఆలపించారు.

కార్యక్రమంలో హనుమంతరావు, సోమేశ్, లంకా ప్రసాద్, రవిప్రసాద్, సాయి సింధూర, రామలక్ష్మి, అపర్ణ, అచ్యుత పాల్గొన్నారు. తమ గానంతో సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు.



అలరించిన ‘ఎంతెంత దయ నీది ఓ సాయి’ సంగీత విభావరి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

సప్తస్వరాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ‘ఎంతెంత దయ నీది ఓ సాయి’ పేరిట నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ కళా లలిత కళావేదికపై ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ రెండో సీజన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వై.ఎస్. రామకృష్ణ బృందంతోపాటు పలువురు గాయనీగాయకులు పాల్గొని మధురమైన సినీ గీతాలను ఆలపించారు. నేమాన లలిత తదితరులు తమ గానంతో సంగీతాభిమానులను ఆకట్టుకున్నారు. అతిథులు, కళాకారులు, సంగీత ప్రియుల సమక్షంలో కార్యక్రమం సాగింది.



రైతు కుటుంబం నుంచి విదేశీ విద్యకు.. ఆరవ్‌కు ఉపకారవేతనమే అండ

ఆస్ట్రేలియాలో కృత్రిమ మేధలో ఉన్నత విద్యకు తోడ్పడిన నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

గ్రామీణ రైతు కుటుంబానికి చెందిన ఓ యువకుడి విదేశీ విద్య కలను నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ సాకారం చేసింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధలో మాస్టర్స్ విద్యను అభ్యసించేందుకు 26 ఏళ్ల ఆరవ్ మానేకు (పేరు మార్చారు) ఈ పథకం అండగా నిలిచింది.

షెడ్యూల్డ్ కులానికి చెందిన ఆరవ్ పరిమిత ఆర్థిక వనరులున్న వ్యవసాయ కుటుంబంలో పెరిగారు. కృత్రిమ మేధ రంగంలో వృత్తిని నిర్మించుకోవాలన్న పట్టుదల ఉన్నప్పటికీ, విదేశీ విద్యకు అవసరమైన ఖర్చులు కుటుంబానికి పెనుసవాలుగా మారాయి. అంతర్జాతీయ విద్యావకాశాలపై తగిన సమాచారం, మార్గదర్శకత్వం అందుబాటులో లేకపోవడం కూడా ఆయన ప్రయాణాన్ని క్లిష్టం చేసింది.

ఆస్ట్రేలియాలో చదువుతున్న సమయంలో తరువాతి సెమిస్టర్లలో విశ్వవిద్యాలయ ఫీజులు పెరగడంతో ఆర్థిక భారం మరింత అధికమైంది. వసతి, జీవన వ్యయాలు, విద్యా సామగ్రి ఖర్చులను భరిస్తూనే చదువును కొనసాగించడం కష్టంగా మారింది. అయినప్పటికీ కృత్రిమ మేధ ఇంజినీర్‌గా ఎదగాలన్న లక్ష్యాన్ని ఆరవ్ వదులుకోలేదు.

ఈ నేపథ్యంలో నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద 2024--2026 కాలానికి ట్యూషన్ ఫీజులు, జీవన వ్యయాలు, ఇతర విద్యా సంబంధిత ఖర్చులకు ఆర్థిక సహాయం అందింది. కుటుంబంపై భరించలేని భారం పడకుండా ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఈ తోడ్పాటు దోహదపడింది.

మోనాష్ విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్యతోపాటు అంతర్జాతీయ పరిచయాలు, కృత్రిమ మేధలో అధునాతన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం ఆరవ్‌కు లభించింది. సకాలంలో అందిన విద్యా సహాయం ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక, భౌగోళిక అడ్డంకులను అధిగమించేందుకు ఎలా తోడ్పడుతుందో ఆయన ప్రయాణం చాటుతోంది.

సౌర విస్ఫోటనాలపై ఆదిత్య--ఎల్1 కొత్త వెలుగు

అసమాన విస్తరణను గుర్తించిన వెల్క్.. అంతరిక్ష వాతావరణ అంచనాలకు ఉపయోగపడనున్న అధ్యయనం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

సూర్యుడి నుంచి వెలువడే భారీ కరోనల్ ద్రవ్య ఉద్గారాలు (సీఎంఈలు) విస్తరించే తీరుపై భారత తొలి అంతరిక్ష సౌర పరిశీలన కేంద్రం ఆదిత్య--ఎల్1 కొత్త విషయాలను వెల్లడించింది. ఈ ఉద్గారాలు ఒకే రీతిలో గోళాకార బుడగలా విస్తరించకుండా, అసమానంగా వ్యాపించవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉపగ్రహాలు, సమాచార వ్యవస్థలను ప్రభావితం చేసే అంతరిక్ష వాతావరణాన్ని అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధన ఉపయోగపడనుంది.

ఆదిత్య--ఎల్1లోని ప్రధాన పరికరం విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వెల్క్) సమాచారం, నాసా సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ పరిశీలనలు, త్రిమితీయ నమూనాలను కలిపి భారత ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ (ఐఐఏ) పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. ఫలితాలు ‘ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్’లో ప్రచురితమయ్యాయి.2024 ఆగస్టు 5న సూర్యుడి పశ్చిమ అంచుకు సమీపంలోని క్రియాశీల ప్రాంతం నుంచి వెలువడిన సీఎంఈని పరిశోధకులు విశ్లేషించారు. నాసా చిత్రాలు ఉద్గారం ఆకాశతలంపై ఎలా వ్యాపించిందో చూపగా, వెల్క్ వర్ణపట సమాచారం అందులోని వేడి ప్లాస్మా పరిశీలకుడి వైపు, వ్యతిరేక దిశలో కదులుతున్న తీరును వెల్లడించింది.సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాలో సుమారు 18 లక్షల కెల్విన్ ఉష్ణోగ్రత వద్ద ఉండే ప్లాస్మాను వెల్క్ పరిశీలిస్తుంది. అధికంగా అయనీకరణ చెందిన ఇనుప పరమాణువుల నుంచి వెలువడే 530.3 నానోమీటర్ల ఆకుపచ్చ కాంతిలో తరంగదైర్ఘ్య మార్పులను విశ్లేషించడం ద్వారా ప్లాస్మా కదలికల వేగాన్ని గుర్తిస్తుంది.పరిశీలనల్లో నమోదైన నమూనాను సమాన విస్తరణతో రూపొందించిన త్రిమితీయ నమూనా వివరించలేకపోయిందని పరిశోధకులు తెలిపారు. వాలుగా ఉన్న సీఎంఈ అక్షం, పక్కలకు అసమానంగా జరిగే విస్తరణను పరిగణనలోకి తీసుకున్న నమూనా మాత్రం వాస్తవ పరిశీలనలకు దగ్గరగా సరిపోయిందని వివరించారు.ప్రారంభ దశలో సీఎంఈ ఆకారం అసమానంగా ఉండటం వల్ల సౌర గాలితో దాని పరస్పర చర్య, ప్రయాణంలో ఎదురయ్యే నిరోధం మారవచ్చని అధ్యయన సహరచయిత జయంత్ జోషి తెలిపారు. ఇవి ఉద్గారం వేగాన్ని, భూమికి చేరుకునే సమయాన్ని ప్రభావితం చేయవచ్చన్నారు.

సింగరేణిలో గైర్హాజరు కారణంగా తొలగింపునకు గురైన వారి కేసుల పునఃపరిశీలనకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ

సింగరేణి భవన్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03 :

సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో విధులకు గైర్హాజరు కారణంగా తొలగించబడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. 01.04.2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని పేర్కొంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా డిస్మిస్డ్ ఉద్యోగులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరిన నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

ఇవీ అర్హతలు....

తొలగించబడిన కాలానికి ముందున్న గత 05 క్యాలెండర్ సంవత్సరాలలో ఏదైనా 2 సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (యూజీ), కేటగిరీ-× పోస్టులో పునఃనియామకం కోసం వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. అర్హత కలిగి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే డిస్మిస్డ్ ఉద్యోగులు తగిన ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి, తాము చివరగా పనిచేసిన గని / డిపార్ట్‌మెంట్ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 14.11.2026గా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అర్హత కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, తదుపరి చర్యల నిమిత్తం నిర్దిష్ట తేదీలోగా సంబంధిత అధికారులకు పంపించాలని కోరింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గనులు లేదా శాఖల అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

బుసాన్‌లో భారత్--దక్షిణ కొరియా నౌకాదళాల సంయుక్త విన్యాసాలు ముగింపు

సముద్ర సహకారాన్ని బలోపేతం చేసిన ఐఎన్ఎస్ సహ్యాద్రి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

దక్షిణ కొరియాలోని బుసాన్‌లో నిర్వహించిన భారత్--దక్షిణ కొరియా నౌకాదళాల ద్వైపాక్షిక విన్యాసాల్లో భారత యుద్ధనౌక ఐఎన్ఎస్ సహ్యాద్రి తన భాగస్వామ్యాన్ని అక్టోబర్ 29న విజయవంతంగా ముగించింది. ఇరు నౌకాదళాల మధ్య సముద్ర సహకారం, సమన్వయం, పరస్పర అవగాహనను ఈ విన్యాసాలు మరింత బలోపేతం చేశాయి.నౌకాశ్రయ దశలో ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది వృత్తిపరమైన చర్చలు, పరస్పర నౌకల సందర్శనలు, కార్యాచరణ వివరణలు, నిపుణుల స్థాయి సమావేశాల్లో పాల్గొన్నారు. సముద్ర కార్యకలాపాలకు సంబంధించిన అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు సిబ్బంది మధ్య స్నేహబంధాన్ని పెంపొందించాయి.సముద్ర దశలో ఐఎన్ఎస్ సహ్యాద్రి, దక్షిణ కొరియా యుద్ధనౌక ఆర్ఓకేఎస్ మున్ము ది గ్రేట్ సంయుక్తంగా నౌకాయాన విన్యాసాలు, హెలికాప్టర్ కార్యకలాపాలు, సముద్ర ఎఖఅశీవబజతీవం నిర్వహించాయి. ఒకరి కార్యాచరణ విధానాలను మరొకరు అర్థం చేసుకోవడంతోపాటు సముద్రంలో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరుచుకున్నాయి.ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రత పరిరక్షణకు ఇటువంటి విన్యాసాలు దోహదపడతాయని భారత నౌకాదళం పేర్కొంది. నిరంతర పరస్పర సంప్రదింపులు, సహకారం ద్వారా సముద్ర సంబంధాలను మరింత విస్తరించాలన్న ఇరు దేశాల సంకల్పానికి ఈ విన్యాసాలు ప్రతిబింబంగా నిలిచాయి.

సాంకేతికంగా శక్తిమంతమైన సైన్యం నిర్మాణమే లక్ష్యం: రాజ్‌నాథ్ సింగ్

2029 నాటికి రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తులు.. రూ.50 వేల కోట్ల ఎగుమతుల లక్ష్యం



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 03:

ప్రస్తుత, భవిష్యత్తు భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా భారత సాయుధ దళాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారం ‘భారత రక్షణ దళాల ఆధునికీకరణ’ అంశంపై నిర్వహించిన రక్షణ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

మారుతున్న యుద్ధ విధానాలు, కొత్త భద్రతా సవాళ్లు, అధునాతన ఆయుధ వ్యవస్థల సమీకరణ, త్రివిధ దళాల సమన్వయం, స్వదేశీ రక్షణ తయారీపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కృత్రిమ మేధ, స్వయంచాలక వ్యవస్థలు, మానవరహిత వేదికలు, సైబర్, అంతరిక్ష, ఎలక్ట్రానిక్ యుద్ధ సాంకేతికతలను సైనిక సామర్థ్యాలతో అనుసంధానించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

2026--27 ఆర్థిక సంవత్సరంలో రక్షణ బడ్జెట్‌ను రికార్డు స్థాయిలో రూ.7.85 లక్షల కోట్లకు పెంచినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఇందులో ఆధునికీకరణ, మూలధన కొనుగోళ్ల కోసం రూ.2.19 లక్షల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నిధుల సమర్థ వినియోగంతోపాటు దళాల అత్యవసర అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం కీలకమన్నారు.

రక్షణ రంగంలో స్వావలంబన గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. 2014--15లో రూ.46,429 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025--26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరిందన్నారు. 2014లో రూ.2 వేల కోట్లలోపే ఉన్న రక్షణ ఎగుమతులు ప్రస్తుతం సుమారు రూ.40 వేల కోట్లకు పెరిగాయని వివరించారు. 2029 నాటికి రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తులు, రూ.50 వేల కోట్ల ఎగుమతులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

అధునాతన ఆయుధాలు, క్షిపణులు, రక్షణ వ్యవస్థల అభివృద్ధిలో డీఆర్‌డీఓ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల నుంచి భారీ పరిశ్రమల వరకు ప్రైవేటు రంగానికి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రక్షణ దళాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారం మరింత పెరగాలని సూచించారు.

సైనిక బలం సాంకేతికత, ఆర్థిక వనరులతోపాటు సిబ్బంది నైపుణ్యం, సన్నద్ధతపై ఆధారపడి ఉంటుందని రాజ్‌నాథ్ అన్నారు. మారుతున్న యుద్ధ అవసరాలకు అనుగుణంగా త్రివిధ దళాలు తమ నిర్మాణాలను మెరుగుపరుచుకుంటున్నాయని చెప్పారు. భారత సైన్యంలో ఏర్పాటు చేసిన ‘అశని’, ‘భైరవ్’, ‘శక్తిబాణ్’ ప్లాటూన్లు సమకాలీన కార్యాచరణ అవసరాలను సమర్థంగా ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

ఆధునికీకరణ అంటే కొత్త ఆయుధాలు కొనుగోలు చేయడమే కాదని, దీర్ఘకాలిక స్వదేశీ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం కూడా అని స్పష్టం చేశారు. విదేశీ వనరులపై వ్యూహాత్మక ఆధారపడటాన్ని తగ్గిస్తూ పరిశోధన, ఆవిష్కరణలు, దేశీయ పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు.

సమావేశంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పలు సూచనలు చేశారు. కీలక సామర్థ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం, కొనుగోలు--అభివృద్ధి ప్రక్రియలను వేగవంతం చేయడం, నిర్దేశిత లక్ష్యాల పురోగతిని సమీక్షించడంపై దృష్టి సారించారు. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్,

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136